"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుపతి పరిసరక్షేత్రాలు

తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుపతి పరిసరక్షేత్రాలు

రచన
గోపికృష్ణ

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి
**2014**

# TIRUPATI PARISARA KSHETRAALU

**By**
Gopi Krishna

T.T.D. Religious Publications Series No.1000
© All Rights Reserved

*First Edition:- 2013*

*Re-Print:- 2014*

Copies: 3000

*Published by :*

**M.G.GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***

Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి"**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేడు. ఇక మీదకూడ ఉండడు – అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో ప్రస్తుతం శ్రీగోపికృష్ణగారు రచించిన **'తిరుపతి పరిసరక్షేత్రాలు'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాం. భక్తు లీ

గ్రంథం ద్వారా తిరుపతికి పరిసరాల్లో వుండే క్షేత్రాలను గూర్చి వివరంగా తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# క్షేత్ర సూచిక


1. శ్రీనివాసమంగాపురం – శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి 1
2. తిరుచానూరు – శ్రీ పద్మావతీదేవి అమ్మవారు 10
3. అప్పలాయిగుంట – శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి 16
4. కార్వేటినగరం – శ్రీ వేణుగోపాలస్వామి 19
5. నారాయణవనం – శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి 23
6. నాగలాపురం – శ్రీ వేదనారాయణస్వామి 31
7. తరిగొండ – శ్రీ లక్ష్మీనరసింహస్వామి 38
8. వాయల్పాడు – శ్రీ పట్టాభిరామస్వామి 43
9. తొండవాడ – శ్రీ అగస్త్యేశ్వరస్వామి 46
10. శ్రీకాళహస్తి – శ్రీకాళహస్తీశ్వరస్వామి 50
11. తొండమనాడు – శ్రీ పెరుమాళ్‌స్వామి 52
12. కాశీబుగ్గ (నగరి) – శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి 54
13. కరియమాణిక్యనగరి – శ్రీ కరియమాణిక్యస్వామి 56
14. కాణిపాకం – శ్రీ వరసిద్ధి వినాయకస్వామి 57

# 1. శ్రీనివాస మంగాపురం - శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

తిరుపతికి పశ్చిమంగా, 10 కి.మీ దూరంలో, మదనపల్లి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న, ఈ కుగ్రామం ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది. సిథకుట్టి, సిధకుట్టి అనే శ్రీనివాసపురం, శ్రీనివాసపుర గ్రామం, అలమేలుమంగాపురం అని అనేక పేర్లతో పిలువబడింది. ఇది కొట్టాల స్థలం అనే మజరాకు చెందినది. వైకుంఠవలనాడు (చంద్రగిరి) తాలూకా, తిరువేంకట కొట్టం (తిరుమల తిరుపతి) జిల్లా. క్రీ.శ. 19వ శతాబ్దికి చెందిన తరిగొండ వేంగమాంబ దానశాసనంలో శ్యామల అడవులకు ఆనుకొని ఉన్న నాగపట్ల దీనికి కేంద్రస్థానమైంది. స్వర్ణముఖినదికి ఉపనదియైన కల్యాణి (వికల్య) గట్టుమీద ఈ గ్రామం వెలసింది.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఎంతో ఇంపైన చోటు ఇది. తిరుమల ఆలయం, శ్రీనివాసమంగాపుర ఆలయం రెండూ ఒకే సరళరేఖమీద ఉన్నాయి. లేదంటే ఒకటి కొండపైన, ఇంకొకటి కొండ క్రింద ఉన్నాయి. దీనికి సమీపంలో స్వర్ణముఖినదీ తీరంలో శ్రీ ఆనందవల్లీసమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఉంది. ఒకనాటి అగస్త్యాశ్రమం ఇది. చిత్తూరు ప్రధాన రహదారికి ఆనుకొనే ఉంది. తిరుపతికి 10 కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి కొత్త పెండ్లికొడుకైన శ్రీనివాసుడు తన దేవేరియైన పద్మావతితో తిరుమలకు పోతూ వచ్చాడు. అగస్త్యమహాముని పసుపు బట్టలతో ఉన్న ఈ నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు ఆ వస్త్రాలతో కొండ ఎక్కడం నిషేధమని, ఆరుమాసాల తరువాత ఆ నిషేధం ఉండదని గుర్తుచేశాడు. మరవళి అని ఎటూ ఇంతదూరం విచ్చేశారు. ఇక తిరిగిపోవడానికి వీలులేదు. ఇక్కడే ఉండండని అగస్త్యమహాముని ఆత్మీయతతో చెప్పగా ఇక చేసేదేమీ లేక శ్రీనివాసుడు అంగీకరించాడు. నూతనదంపతులు ఆశ్రమంలో కాపురం చేయడం అంతగా బాగుండదని

పూజాపునస్కారాలు ముగించుకొని అక్కడికి సమీపంలోని శ్రీనివాసమంగా పురంలో గడిపేవారు.

మనోజ్ఞమైన వాతావరణానికి శ్రీనివాసమంగాపురం పెట్టింది పేరు. ఇక్కడినుంచి శ్రీవారిమెట్టు మార్గం గుండా తిరుమల చేరడానికి దగ్గరి దోవ. శేషాచల సానువుల అందచందాలను వీక్షిస్తూ ఆరుమాసాలు గడిపిన స్వామి అగస్త్యమహాముని అనుమతి తీసికొని పద్మావతీదేవిసహితంగా శ్రీవారిమెట్టుమార్గంగుండా తిరుమల చేరినాడు. ఇలా శ్రీవారిమెట్లు, అమ్మవారి కాలిమెట్లు రెండూ సోకిన ఈ కాలిమార్గం ఎంతో పవిత్రమైనది. తదనంతర కాలంలో చంద్రగిరి రాజ్యాన్ని ఏలిన రాజులెందరో చంద్రగిరి కోటనుంచి శ్రీవారి ఆలయం వరకు ఏర్పడిన సరళమార్గాన్ని అనుసరించి స్వామి దర్శనం చేసికొని పునీతులైనారు.

శ్రీనివాసమంగాపురంలోను, తొండవాడ అగస్త్యాశ్రమంలోను స్వామివారు ప్రవాసజీవితం గడిపి అవతల తొండమాను చక్రవర్తి నిర్మించిన ఆలయప్రవేశం చేసిన ఐతిహ్యం గుర్తుగా ఒక ఆలయాన్ని నిర్మించాలన్న కోరిక ఒకానొక రాజవంశం వారికి కలిగింది. వెంటనే వారు వికల్య (కల్యాణి) నదీతీరాన్ని ఆనుకొని శ్రీనివాసమంగాపురంలో ఒక ఆలయాన్ని కల్యాణ వేంకటేశ్వరస్వామిపేర నిర్మించారు.

యాదవరాజులో లేదా తొలి విజయనగరరాజులో స్పష్టంగా తెలియదు. మొత్తానికి వారు అప్పటి కొట్టాల స్థలం (ప్రస్తుత చంద్రగిరి ఎగువరెడ్డివారి పల్లి శిథిల గోపురం ఉన్నచోట) లో ఒక యజ్ఞశాల గుడి నిర్మించి అందులో యజ్ఞం చేసి సిథకుట్టి అనే శ్రీనివాసపురంలో స్వామివారికి ఒక ఆలయం నిర్మించారు. ఆలయ నిర్మాతల శాసనాలు లభ్యం కానందున ఉన్న ఆధారాలతో ఇలా ఊహించవలసివస్తోంది.

మొత్తానికి శ్రీనివాసపురం అటు తిరుమలకు, ఇటు తిరుపతికి, ఈ వైపు చంద్రగిరికి, ఆవైపు ఆరేపల్లి రంగంపేట, నాగపట్లకు కూడలి స్థానమై



అలరారుతోంది. దానికి దీటుగ ఆలయ నిర్మాణం జరిగింది. తిరుమలలో లాగ ఈయన స్వయంభూ కాకపోయినా ఆయనకు సరిసమానంగా కల్యాణవేంకటేశ్వరుని వెలయింపజేసినారు. ఆయనకు లాగానే అన్ని హంగులు సమకూర్చినారు. వికలాంగులు, వయోవృద్ధులు, అబలలు అందరికీ తిరుమలకు కాలిదారిన పోయే శ్రమ తప్పించినారు. అందరూ ఈయన దర్శనంతో తృప్తిపడేలాగు చేసినారు.

అప్పట్లో శ్రీనివాస మంగాపురం ఎంతో ఉన్నతిలో ఉండేది. విజయనగర సామ్రాట్టు రెండవదేవరాయలు (ప్రౌఢదేవరాయలు) తిరుమల ఆలయంలో వేదపారాయణాన్ని పునరుద్ధరించదలచి వారికోసం అన్వేషించినప్పుడు 24 మంది మహాజనం (వేదపారాయణదార్లు) శ్రీనివాసపురంలోనే లభ్యమైనారంటే దాని ప్రాశస్త్యం తెలుస్తోంది. ఏ కారణంతోనో తిరుమల ఆలయంలో వేదపారాయణం నిలిచిపోయింది. అది వెలితిగా ఉందని స్థానికులు భక్తులు అళగప్పిరానార్ అను తిరుక్కలి కన్టిదాసర్ ద్వారా రాయల అధికారి దేవణ్ణ ఉడయార్‌కు నివేదించినారు. ఆయన సంగమవంశ రెండవదేవరాయల పేరుమీద క్రీ.శ. 1433లో వేదపారాయణాన్ని పునఃప్రారంభింపజేసి 24 మంది మహాజనం నెలకిద్దరు చొప్పున సంవత్సరాంతం వరకు పనిచేసే లాగా ఏర్పాటు చేసి వారికి రాజ భాండాగారానికి చెందిన శ్రీనివాసపుర అర్ధగ్రామాన్ని శ్రోత్రియంగా ఇచ్చారు. దాని ఆదాయం చాలదని వారు విన్నవిస్తే శ్రీభాండారానికి చెందిన మిగిలిన అర్ధభాగాన్ని దేవదాన గ్రామాల (తిరువిడైయాట్టం) వారు చందాలు వేసి 200 పణములు దేవర ఖజానాలో చెల్లించి కొని ఈ వేదపారాయణం దార్లకు పూర్తి గ్రామాన్ని శ్రోత్రియంగా ప్రకటించినారు.

శ్రీవారిమెట్టు దగ్గర కొండకిందపల్లి అనే ఒక కుగ్రామం ఉండేది. ఆ గ్రామస్థులు కొండకు వచ్చిపోయే యాత్రీకులకు సహాయంగా ఉంటూ వ్యాపారస్థుల బరువులు మోస్తూ కొండమీద చిల్లర మల్లర పనులు చేస్తూ,

గోశాలకు గడ్డికోస్తూ జీవనం సాగించేవారు. వేదపారాయణదార్లు ఉదయం కొండ ఎక్కేటప్పుడు సాయంకాలం దిగేటప్పుడు వారికి కూడ ఆసరాగా ఉండేవారు. చంద్రగిరి రాజు సాళువ నరసింహుడు ఈ దారిలో ఎన్నో దేశాంతరి మండపాలు నిర్మించి ఊటబావులు త్రవ్వించినాడు. ఆయన దగ్గర రెండు గుర్రాలు ఉండేవట. వాటిమీద శ్రీవారి ఆలయానికి సరకులు పంపేవారట. అవి కొండచేరి ఆలయంలో సరుకులు అప్పగించి ప్రసాదంతో తిరిగివచ్చి చంద్రగిరి కోట చేరేవట. అవి చనిపోయినప్పుడు వాటి సమాధులు శ్రీవారిమెట్టు దగ్గరే నిర్మించారు. సాళువ నరసింహరాయలు ఇక్కడొక దిగుడుబావిని సుందరంగా నిర్మించినాడు. దాని గట్టున శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నిర్మించినాడు.

ఇంత సుభిక్షంగా ఉన్న ఈ పరిసరాలు కల్యాణినదికి వరదలు రావడంతో అంతా తారుమారయింది. శ్రీనివాసపురం తుడిచిపెట్టుకపోయింది. కల్యాణ వేంకటేశ్వరుని ఆలయం నేలకొరిగింది. అంతా అస్తవ్యస్తం. ఏదీ దక్కలేదు. యాత్రీకుల రాకపోకలు ఆగిపోయాయి. తిరుమల కొండకు సరఫరాలు నిలిచిపోయాయి. కొండకిందపల్లి వాసులగు బతుకు భారమైంది. వెంటనే వారు పల్లిని ఖాళీచేసి జనావాసాల్లోకి వచ్చేశారు. కొప్పెర (హుండీ) దగ్గర కావలి ఇతరవ్యవహారాలు చూసుకొనేవారు. శ్రీనివాసపురంకు దిగువన కొప్పెరవాండ్లపల్లి స్థాపించుకొన్నారు. చీలిన మరొక వర్గం వారికి దిగువన పెరుమాళ్లపల్లి నిర్మించుకొన్నారు. వీరంతా ఆలయంలో ఊడిగం చేసేవారు. వీరు తమవెంట శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహం తెచ్చుకొని ప్రతిష్ఠించుకొన్నారు. అక్కడ పూజలు ఆగిపోయిన ఆ విగ్రహం ఇక్కడ పూజలందుకోవడం విశేషం. ఆలయ ధ్వజస్తంభం మాత్రం తిరుమల జి.యన్.సి. టోల్‌గేట్ చేరింది.

వంద సంవత్సరాలు గడిచింది. శ్రీకృష్ణదేవరాయల సవతి తమ్ముడు అచ్యుతదేవమహారాజు పరిపాలనాకాలంలో తాళ్లపాక అన్నమాచార్యుల



తొలిమనవడు, పెద తిరుమలాచార్యుల కుమారుడైన చినతిరుమలాచార్యుడు శ్రీనివాసపుర దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేయాలని నిశ్చయించుకొని అనుమతి పొందినాడు. ఈ చిన తిరుమలాచార్యుడు చాల ప్రసిద్ధిగాంచిన వాడని ఆతనికున్న ఈ బిరుదులు తెలియజేస్తున్నాయి. శ్రీ మద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్ర పంజర, ఇవి వేదాంతదేశికుని తలపింప జేస్తున్నాయి. ఆలయం జీర్ణోద్ధరణ చేసి అన్నీ కొత్త విగ్రహాలే ప్రతిష్ఠించినాడు. పాతవి ఏమైనాయో తెలియదు. ఆయన ప్రతిష్ఠించిన విగ్రహాలు శ్రీ వేంకటేశ, నాచ్చియార్ (అమ్మవారు), అనంత (ఆదిశేషుడు), గరుడ విష్వక్సేన, ఒక పెరుమాళ్, ఆళ్వార్లు, ఉడైయవర్ (రామానుజ), పూర్వాచార్యులు, అన్నమాచార్య (తాత, ఈయనకు గురువు). వీరందరికి పూజాపునస్కారాలు, వర్ష తిరునక్షత్రాల పూజానైవేద్యాలు అన్నీ ఏర్పాటు చేసినాడు. ఇవన్నీ క్రీ.శ. 22-03-1540 సంవత్సరం నాటికి పూర్తయినాయి. ఆలాగ ఆలయంలో శాసనం వేసినారు.

మొత్తానికి శ్రీనివాసమంగాపురం వీరికి సర్వమాన్య అగ్రహారమైంది. మరొక వెలుగు వెలిగింది. అలమేలుమంగమ్మను ప్రతిష్ఠించడంతో ఊరిపేరు అలమేలుమంగాపురమైంది. పద్మావతీదేవి కూడా ఆమే. అందుకు సాక్ష్యం ఆమే అలా సాక్ష్యం చెప్పింది. తాళ్లపాక చిన్నన్న అనే తిరువేంగళనాథుడు అన్నమాచార్యుల నాలుగవ మనవడు. చిన తిరుమలాచార్యుని మూడవ ముద్దులతమ్ముడు. ఆతని తామ్రశాసనంలో ఈ క్రింది ఐతిహ్యం ఉంది.

పద్మావతీదేవి అయోనిజ. పైగా పద్మసంభవ. ఆమె మా వంశంలో పుట్టిందని, కాదు మా వంశంలో పుట్టిందని పద్మసాలీలు, జాంద్రవారు పోట్లాడుకొన్నారు. మధ్యవర్తిత్వం చేయమని తాళ్లపాక చిన్నన్నను ఆశ్రయించినారు. ఆయన ఆ విషయం నాకు మాత్రం ఎలా తెలుస్తుంది? అయినా ఆమెనే అడిగి తెలిసికొందామని అందరినీ ఒక సుముహూర్తాన

శ్రీనివాసపురానికి రమ్మన్నాడు. పద్మసాలీలు, జాంద్రవారు, చుట్టుప్రక్కల గ్రామాలలోని పిన్నలు, పెద్దలు, చంద్రగిరి కోట నుంచి పురుషోత్తమరాయలవారు ఇంకా తక్కిన ఆహ్వానితులందరూ అలమేలు మంగాపురంచేరి అమ్మవారి ముందు ఆసీనులైనారు. తాళ్లపాక చిన్నన్న అమ్మను ఆవాహనం చేసి అసలు విషయం అడుగగా ఆమె అందరూ విస్తుపోయేటట్టు తాను పద్మసాలీల ఆడపడుచునని అశరీరవాణియై వినిపించింది. దాంతో పద్మసాలీలు రెచ్చిపోయారు. జాంద్రవారు తోకముడుచుకున్నారు.

చప్పన్న దేశాలలోని పద్మసాలీలు పదివేల వరహాలు సేకరించి తాళ్లపాక చిన్నన్నను తమ కులవుద్ధరణ చేసిన కులగురువుగా స్వీకరించి ఆయనకు పాదకానుకగా సమర్పించినారు. దాంతో ఆయన మరో పదివేల వరహాలు శ్రీవారి ఆలయం నుంచి తెప్పించి ఆ ఇరువదివేల వరహాలతో చంద్రగిరి తొండవాడల మధ్య తిమ్మాపురం (తిరుమల అప్పుడు) ఆలయం నిర్మించినాడని తామ్రశాసన సారాంశం. ఆలయం శిథిలమైంది. శిల్పస్థాపాలు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంగణం చేరినాయి. ఆలయం ఎదురుగా ఉండే ఆంజనేయస్వామి అగస్త్యేశ్వర క్షేత్ర ప్రవాసి ఐనాడు. కానీ మహాద్వార గోపుర పునాది దానిమీదున్న రామాయణ దృశ్యాల కుడ్యశిల్పాలు ఇంకా అలాగే ఉన్నాయి.

అమ్మవారు తాను పద్మసాలీల ఆడపడచునని చెప్పుకొన్నా అంతకంటే ఎక్కువగా ఆమె తాళ్లపాకం వారి ఆడబిడ్డ. వారు ఆడమన్నట్టు ఆడుతుంది. చెప్పమన్నట్టు చెపుతుంది. సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి అన్నమాచార్యులను 'మామా' అని సంబోధించినాడట. ఆయనేకాదు తిరుమల శ్రీవారికి అనేక మంది మామలు ఉన్నారు. ఆకాశరాజు, తొండమానుచక్రవర్తి, ఆనందాళ్వారు. ఇలాగ ఎందరో?



తాళ్లపాకం వారి జీర్ణోద్ధరణ సజావుగా జరిగి తిరుమలలో లేనన్ని దేవతామూర్తులు అమ్మవారితో సహా ఇక్కడ కొలువై పూజలందుకొంటున్న పుణ్యకాలం రెండువందల సంవత్సరాలు మాత్రమే. తరువాత మహమ్మదీయులను కారుమేఘాలు కమ్ముకొన్నాయి. హిందూదేవాలయాల భద్రతకు ముప్పు వాటిల్లింది. నిజానికి ఎక్కువ నష్టం హైదరాలీ సేనలతోనే జరిగింది. ఆంగ్లేయులమీద కక్ష తీర్చుకోవడానికి వారికి ఆహారసరఫరా దారులైన పులికాట్ సరస్సుదారి, మామండూరు కనుమదారి, కల్లూరు కనుమదారులను దిగ్బంధం చేస్తూ ఎక్కువ కాలం ఈ ప్రాంతంలోనే ఉండిపోయాడు. క్రీ.శ. 1782లో చంద్రగిరి కోటను ఆక్రమించుకొని ఆ పరిసర ఆలయాలను సైన్యానికి వదలివేశారు. తి.తి.దేవస్థానం ఆలయాలు లంచం ఇచ్చి తప్పించుకొన్నాయి. కానీ తక్కిన ఆలయాలు కొల్లగొట్టబడినాయి.

ఏ కారణం చేతనో శ్రీనివాసమంగాపుర కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తిరుమల ఆలయానికి అనుబంధం కాదు. అందుకే ఎక్కువ నష్టం జరిగింది. అమ్మవారు, ఆచార్యపురుషులు, ఆళ్వార్లు, పరివారదేవతలు అందరి శిరస్సులు ఎగిరిపోయాయి. అసలు స్వామి ఆకారాన్ని చూసి జడుసుకొన్నారేమో? నగలు మాత్రం ఒలుసుకొని ఆయన్ను అలాగే వదలివేశారు. మ్లేచ్ఛులు ప్రవేశించిన ఆలయంలో తాము ప్రవేశించి తిరిగీ పూజలు నిర్వహించలేమని అర్చకులు భీష్మించుకొని ఆ వైపు చూడలేదు. అంతే ఆలయం శిథిలమైంది. తిరుమలలోలాగ ఇక్కడ కూడ స్వామి ఒంటరిగా ఉండదలచుకొన్నాడేమో? అలాగే ఉండిపోయాడు. గోపురం మీద గబ్బిలాలు, పావురాలు కాపురం బెట్టినాయి.

క్రీ.శ.1801లో ఈ ప్రాంతం నిజాము కానుకగా ఆంగ్లేయుల వశమైంది. ఆలయం ముఖమండపంలోని శిల్పసంపద చూసి పురావస్తు శాఖవారు స్వాధీనం చేసికొని ఆ సంగతి తెలియజేస్తూ ఫలకం అమర్చారు.

స్వామి చూపు బహిర్గతంకాకుండా అడ్డంగా ఒక గోడకట్టి ఆలయాన్ని మూసివేశారు.

ఉత్సవ విగ్రహాలు, పుజా పరికరాలు కొన్ని, తాళ్లపాక చిన్నన్న తామ్రశాసనం ఆ వంశీకులు భద్రపరిచారు. చంద్రగిరి సమీపంలోని యజ్ఞశాలగుడి, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామిగుడి, తొండవాడలోని తిరుమలప్పగుడి, అలిపిరి శ్రీలక్ష్మీనరసింహ ఆలయం, కపిల తీర్థంలోని నమ్మాళ్వారుగుడి, అచ్యుతరాయ అగ్రహారంతోబాటు అచ్యుత పెరుమాళ్‌గుడి, అదే రస్తాలోని జియ్యంగార్ గుడి అనబడే తిరుమంగై ఆళ్వారుగుడి, తిరుచానూరులోని అలమేలుమంగమ్మగుడి, వరదరాజస్వామి ఆలయంతోబాటు మరికొన్ని చిన్నచిన్న గుడులు, పేరూరు బండమీద ఒక వైష్ణవాలయం (రామానుజాచార్యులదికావచ్చు) ఇలా ఎన్నిటినో రూపుమాపిన హైదరాలీ దండయాత్ర చేసి ఏం బావుకున్నాడు? మృత్యువును కొని తెచ్చుకొన్నాడు. చిత్తూరు జిల్లా కూడ దాటలేకపోయాడు. నరసింగరాయని పేట దగ్గర సన్నిపాత జ్వరంతో చనిపోయాడు.

నవ్వకనే, నవ్వించకనే, కవ్వించకనే ఏమీ ఎఱగనట్టే శ్రీనివాసపుర వేంకటేశుడు ఇంతపని చేసినాడు. అంతేకాదు. కాంచీపురంలోని ఒక పేద వైష్ణవ బ్రాహ్మణునికి కలలో కనిపించినాడు. నన్ను వెదకి పట్టుకోమన్నాడు. ఇక ఆ బ్రాహ్మణుడికి కునుకు పట్టలేదు. వెంటనే లేచి వెదుక్కుంటూ బయలుదేరాడు. చిరునామా చెప్పని స్వామిని ఎక్కడని వెదకుతాడు? ఎన్నో ఊర్లు తిరిగి ఎక్కడెక్కడో విచారించి చివరకు శ్రీనివాసమంగాపురం చేరుకున్నాడు. స్వామిని కనిపెట్టినాడు. కాళ్లావేళ్లాబడి ఆర్కియాలజీ శాఖవారిని ఒప్పించి అర్చకత్వం చేయ బూనుకొన్నాడు.

ఆయనపేరుత సుందరరాజస్వామి. శ్రీనివాసుని ఆదేశం మేరకు తనకు వీలైనంతలో, తృణమోపణమో నైవేద్యంపెట్టి నెట్టుకుంటూ వచ్చాడు. దేవుడు



తి.తి.దే., వారిని ప్రేరేపించగా 1967లో వారు ఆగమోక్తంగా నిత్యపూజలు ప్రారంభించినారు. సుందరరాజస్వామి తొలుదొల్త పూజ ప్రారంభించిన రోజును పునస్కరించుకొని శ్రీనివాసమంగాపురంలో సాక్షాత్కార వైభవోత్సవములు 1981 సంవత్సరం నుంచి తి.తి.దే., నిర్వహిస్తోంది. నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవాలు కూడ ప్రారంభమైనాయి. తిరుమల ఆలయంలో జరుగు దాదాపు అన్ని ఆర్జితసేవలు ఈ ఆలయంలో కూడా ప్రవేశపెట్టబడినాయి. శాశ్వత అర్చన, అభిషేకం, శ్రవణనక్షత్రం రోజున స్వామివారికి ఊంజలసేవ, నిత్యకల్యాణం, మంగళవారం స్వర్ణపుష్పార్చనసేవ, బుధవారం శతకలశాభిషేకసేవ, శుక్రవారం వస్త్రాలంకారసేవ, ఏటేటా వసంతోత్సవం, పవిత్రోత్సవం, శ్రీపుష్పయాగం వగైరాసేవలు, ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇక బ్రహ్మోత్సవం సరేసరి. లేనిదల్లా ప్లవోత్సవం. పుష్కరిణి లేదుగాబట్టి.

శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవం ప్రతిసంవత్సరం ఆషాఢ శుద్ధ ఉత్తరఫల్గుణీ నక్షత్రంలో జరుగుతుంది. మునుపు ఒక రోజు ఉత్సవం. ప్రస్తుతం మూడురోజులు జరుపుతున్నారు. ఈ సాక్షాత్కారవైభవోత్సవంలో ప్రధానమైనరోజున ఇప్పటికీ కల్యాణ వేంకటేశ్వరుని ముందు శ్రీ వి.ఏ.కె.రంగారావు గారు మద్రాసునుంచి వచ్చి వేంకటేశుని ముందు నృత్య సేవను నిర్వహిస్తూనే వున్నారు. మునుపు యాత్రీకులు, భక్తులు తక్కువ. బహుమానాలూ తక్కువ. ఇప్పుడు అనూహ్యంగా అన్నీ పెరిగాయి. సుందరరాజస్వామికి వలె మనకూ ఆ కల్యాణమూర్తి సాక్షాత్కరించాలని ఆశిద్దాం.

తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట మొదట ఇక్కడి కల్యాణీ తీరంలో వుండేది. తదనంతరం తిరుమల మంగళిబావిచేరి అక్కడి నుంచి మార్పుచెంది ప్రస్తుతమున్నచోటుకు వచ్చి స్థిరపడింది.

* * * * *

# 2. తిరుచానూరు – శ్రీ పద్మావతీదేవి అమ్మవారు

తిరుక్కుడవూరు – అలర్‌మేల్‌మంగాపురం – అలమేలుమంగాపురం –తిరుచానూరు – తిరుచ్చోకినూరు – తిరుశుకనూరు – వాదిరాజపురం – మంగపట్నం – ఇలా ఈ క్షేత్రానికి ఎన్నోపేర్లు. అధిష్ఠానదేవత – అలమేలు మంగ అని పిలువబడుతున్న శ్రీ పద్మావతీదేవి మునుపు వక్షస్థలలక్ష్మిని అలమేలుమంగ అనేవారు. పద్మోద్భవ అయిన పద్మావతిని ఆ పేరుతోనే పిలిచేవారు. ప్రస్తుతం ఇద్దరూ ఒక్కరుగానే పరిగణింపబడుతున్నారు.

శేషాచలం పర్వతాలు, మల్లయపల్లి కొండలు మధ్యలో ఏర్పడినలోయ మైదానంగా మారగా అందులో స్వర్ణముఖినది పవిత్రజలాలు ప్రవహించగా చూసిన ఆకాశరాజు, సంతానం కోసం యజ్ఞం చేయాలనుకున్నాడు. యజ్ఞభూమిని దున్నుతుండగా సహస్రదళ పద్మం బయటపడింది. అందులో ఆడశిశువు లభ్యమైంది. పద్మంలో లభ్యమైనందున ఆమెకు పద్మావతి అని పేరు. ప్రస్తుతం తిరుచానూరులో వుండే అమ్మవారి పేరు కూడా పద్మావతే. శ్రీనివాసుడు పండ్రెండేండ్లు తపస్సు చేసినందువల్ల శ్రీమహాలక్ష్మి బంగారుపద్మంలో అవతరించిందని పురాణ ప్రశస్తి. అందువల్లే ఈ పుష్కరిణిని "పద్మసరోవరం" అంటారు. దీనిగట్టుమీద వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠించిన సూర్యభగవానుని ఆలయం ఉంది.

క్రీ.శ.614లో కడవన్ పెరుందేవి అనేపేరుగల సామవై అను పల్లవ సామంతరాణి తిరువేంకటముడైయాన్ దర్శనార్థం ఇక్కడకు వచ్చింది. అప్పట్లో ఈ ఊరిపేరు తిరుక్కుడవూరు. తిరువేంగడ కొట్టం జిల్లాలోని తిరుక్కుడవూరునాడులోనిది. అంటే ఒక తాలూకా కేంద్రంగా తిరుచానూరు పల్లవచోళరాజుల కాలంలోనే ప్రసిద్ధిగాంచింది. అప్పటికి తిరుపతి పట్టణం ఏర్పడలేదు. లేదంటే కపిలతీర్థం దగ్గర కొత్తూరు' అనే పేరిట ఓ కుగ్రామంఉండేది. స్వర్ణముఖి నీటి సౌకర్యం వల్లనేమో ఇది తిరుమలకు



కూడా కేంద్రస్థానమై అన్ని కార్యకలాపాలు ఇక్కడనుంచే కొనసాగేవి. తిరుమలేశుని ప్రతీకలుగా తిరువేంకటత్తు పెరుమాణాడిగల్, తిరువిలంకోయిల్ పెరుమాణాడిగల్, తిరుమంత్రశాలై పెరుమాణాడిగల్, అను పేరిట ముగ్గురు మూర్తులు పూజింపబడేవారు. మొదటి ఆయన తిరుమలదేవునికి ప్రతీక. రెండవ ఆయన బాలాలయమూర్తి. మూడవ ఆయన తిరుమంత్రం స్వీకరించి వైష్ణవమతం స్వీకరించే వారి సన్నిధిదేవుడు.

సామవైరాణి తిరువిలంకోయిల్‌లో మణవాళపెరుమాళ్ (భోగ శ్రీనివాసమూర్తి) వెండి విగ్రహాన్ని, వెలయింపజేసింది. ఆపాదమస్తకం అన్ని రకాల నగలు చేయించింది. 4000 కుంటలకు పైగా భూమికొని దేవునికి మాన్యంగా ఇచ్చింది. రెండు బ్రహ్మోత్సవాలు ఒక సంవత్సరంలోగా చేయమని పురమాయించింది. ఆమె దానధర్మాలు ఆచంద్రతారార్కంగా ఉండాలని, వాటిని కాపాడే శ్రీవైష్ణవుల పాదాలు తనకు శిరోధార్యమని వినయంగా విన్నవించింది. పల్లవప్రెగ్గడైయ్యార్ కూతురు, శక్తి విటంకన్ అను సామంతరాజు రాణియైన ఈ అరవదేశపు తెలుగుకోడలు వేయించినవే తి.తి.దే., తొలిశాసనాలు. ఇంతకు మునుపు శిలాశాసనాలు మనకు లేవు.

మొదటి రాజేంద్రచోళుని కాలంలో (క్రీ.శ.1011 – 1045) ఆలయ వ్యవహారాల మీద విచారణ జరిగింది. అప్పటికిది రాజేంద్రచోళమండలం లేదా జయంగొండచోళమండలము అని పిలువబడుతోంది. తిరుచానూరు సమీపం తిరుమండ్యం గ్రామ సభవారు తిరుచ్చోగినూరు సభవారిదగ్గర 23 బంగారు నాణెములు (పన్‌లు) తీసికొని శ్రీవారి ఆలయంలో కర్పూర దీపంతో సహా 24 నేతిదీపాలు వెలిగించేటట్టు ఒప్పందం చేసికొన్నారు. కానీ రెండుదీపాలు మాత్రం వెలిగించి తక్కినవి వెలిగించకుండా మానుకొన్నారు. కొఱ్ఱమంగలముడైయాన్ అనే చోళ అధికారి (గవర్నరుకావచ్చు) దృష్టికి ఈ సంగతి వచ్చి ఆయన శుకగ్రామంలోని చోళ న్యాయస్థానం ముందు వసారాలో విచారించి అందరిముందు

తిరుమండ్యం సభవారి నుంచి 23 బంగారు నాణెములను వసూలుచేసి ఖజానాలో కట్టించి, భవిష్యత్తులో ఆలయదీపాలను ఆలయఉద్యోగులే వెలిగించుకోవాలని ఆదేశించినారు.

ఇలాంటిదే మరో సంఘటన. తిరుచ్చుకనూరుకు ఆనుకొని లేదా అందులో కలిసిపోయి జోగులమల్లారం (యోగిమల్లవరం) ఉంది. అక్కడ తిప్పలాదీశ్వరముడైయ నాయనార్ (పరాశరేశ్వరస్వామి) ఆలయముంది. ఆయన అభిషేక నైవేద్యాలకు జయంగొండశోళ బ్రహ్మమారాయన్ అనే ఆయన $26^{1/4}$ కళంజుల అపరంజి ఇచ్చాడు. మూడవరాజరాజచోళుని (క్రీ.శ.1216-1248) కాలంలో ఇది జరిగింది. ధర్మకట్టాలైకాల్ అనే ధర్మకాటాలో తూచియిచ్చినా అది భగవంతునికి ఉపయోగపడడంలేదని ఆ విషయంగా తిరుశుకనూరు సభైయార్ కూడా పట్టించుకోలేదని ఫిర్యాదు స్థానికరాజు వీరనరసింగదేవయాదవరాయలకు చేరింది. తిరుక్కన్నప్పదేవన్ తిరుక్కవనంలో ఆయన విచారణ జరిపాడు. తిప్పలాదీశ్వరముడైయ నాయనార్ ఆలయ సభైయ్యారును, మహేశ్వరులను విచారించి అది నిజమేనని తెలిసికొని ఆ బంగారును రాబట్టి ఖజానాలో జమచేశారు. అదీ వీరనరసింగదేవయాదవరాయల ఘనత. యాదవరాజులు స్థానికులై నందున దేవస్థానానికి ఎంతో సేవచేశారు.

తిరుక్కాళత్తి దేవ యాదవరాయర్ క్రీ.శ.1191-1246 సంవత్సరంలో వెంకటగిరి ముఖ్యపట్టణంగా ఈ ప్రాంతాన్ని ఏలినవాడు. అంతేకాదు తిరుచానూరును తిరుమల ఆలయానికి దానంచేసినవాడు. వీరి కాలంలోనే ప్రాచీన బలరామకృష్ణుల ఆలయం (అళగీయపెరుమాళ్) నిర్మించబడింది. ఆ తరువాతనే వరదరాజ (సుందరరాజ) స్వామి, అమ్మవారి ఆలయాలు అవైపు ఈవైపు నిర్మించబడి ముచ్చటగా మూడు ఆలయాలు ఒకే ఆవరణలో అలమేలు మంగాపురంలో వెలశాయి. చరిత్రకారులు శ్రీకృష్ణాలయము క్రీ.శ.



1221 సంవత్సరం నాటికి, సుందరరాజస్వామి (వరదరాజ) ఆలయము క్రీ.శ. 1541 సంవత్సరం నాటికి, పద్మావతి అమ్మవారి ఆలయము క్రీ.శ. 17వ శతాబ్ది చివరిలో నిర్మించబడినాయని అభిప్రాయపడినారు. నిజానికి పద్మావతమ్మ జీర్ణోద్ధరణ జరిగి స్థిరపడింది క్రీ.శ. 18 శతాబ్ది చివరిలోనే. అందువల్ల ఆయమ్మకు మడులు మాన్యాలు, స్థిర చరాస్తులు, పారంపర్య ఆభరణాలు ఇలాంటివేవీలేవు. ఉన్నదంతా తరువాత సమకూరినవే. పద్మావతమ్మను ప్రత్యేకంగా ఏ శాసనంలోనూ పేర్కొనలేదు. తాళ్లపాక అన్నమాచార్యులు గానీ ఆయన వంశీకులుగానీ పద్మావతమ్మను తమ కీర్తనలలో పాడలేదు. తాళ్లపాక చిన్నన్న తామ్రశాసనంలోని ఇతివృత్తంలో మాత్రం ఉంది. వారు స్తుతించిన అలమేలుమంగ శ్రీవారి వక్షఃస్థల వ్యూహలక్ష్మి మాత్రమే. ఇప్పుడు పద్మావతమ్మ వీరలక్ష్మిగా పరిగణింపబడు తోంది. యాత్రికుల మనసులో సంశయాలు పోగొట్టడానికి పద్మావతిదేవి అన్నా, అలమేలుమంగమ్మ అన్నా, ఇద్దరూ ఒకటేగానీ వేరుగాదు అన్న సిద్ధాంతం అమలు చేయడం, పాటించడం తప్పనిసరి అయింది. అందుకే తిరుచానూరు పంచమి ఉత్సవానికి (తీర్థవారి) తిరుమల శ్రీవారు పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు గౌరవంగా పంపడం పరిపాటి అయింది.

అలమేలుమంగమ్మ కథలు అన్నీ ఇన్నీ కావు. నూతనవధూవరులుగా తిరుమల చేరినప్పుడు స్వామివారు శేషాచలం అంతా తిరిగి అక్కడ వేప, కరివేపాకు చెట్లు లేవని గ్రహించి వేపలేకపోతే పోయిందని కరివేపాకు చెట్టు తెమ్మని అమ్మవారిని పంపించాడట. ఆయమ్మ అలిగి వెదుక్కుంటూపోయి అలమేలుమంగాపురంచేరి అక్కడే ఉండిపోయిందట-పద్మ సరోవరం ఆమె పుట్టినిల్లుగదా! తరువాత స్వామిపోయి ఆమెను రమ్మని పిలువలేదు. ఆమె రాలేదు. అయినా ఆయన నడిరేయి ఏ జామునో అలిపిరికి వచ్చి పాదాలమండపంలో పాదరక్షలు ధరించి అమ్మవారిని పలుకరించి తిరిగి అలిపిరిలో పాదరక్షలు వదలి

సుప్రభాతసేవకు తిరుమల చేరుకుంటారు. ఎన్నిసార్లు తిరుగుతాడో ఏమోగానీ పాదరక్షలు అరిగిపోయి ఉంటాయి.

స్వామి సాక్షాత్కారానికి మునుపు అమ్మవారు కనికరిస్తేనే ఆయన దర్శనభాగ్యం కలుగుతుంది. అమ్మవారు ముందుగా కనబడకపోతే స్వామి సాక్షాత్కారం ఎన్నటికీ కలుగదట. అన్నమాచార్యులు తొలిసారి కొండకు వచ్చి దారిలో ఆకలితో అలమటించినప్పుడు అమ్మవారు కనికరించి ప్రసాదం తినిపించింది. తరువాత స్వామి కటాక్షించినాడు. మామూలు అన్నమయ్య ప్రసిద్ధవాగ్గేయకారుడుగా మారిపోయి సంకీర్తనాచార్యుడైనాడు. స్వామిచేత మామ అనిపించుకున్నాడు. నిత్యకల్యాణంలో తాళ్లపాకవారు కన్యాదాతలుగా స్థిరపడినారు.

తాతయ్యగుంట గంగమ్మ స్వామి తోబుట్టువు. తిరుపతి గంగజాతరకు ఏటేటా తప్పకుండా తిరుమలనుంచి సారె ముందు గోవిందరాజస్వామి గుడిచేరి తరువాత గంగమ్మగుడి చేరుతుంది. అయినవాళ్లకు అంతా పెట్టేస్తున్నాడని అలమేలుమంగమ్మకూడా ఆగ్రహించదు. ఆమెకు కూడా పసుపు కుంకుమలు పంపిస్తాడు కదా!

తిరుచానూరు పద్మావతీతాయార్లకు ఏటేటా కార్తీక బ్రహ్మోత్సవాలు, వసంతోత్సవం, పవిత్రోత్సవం, శ్రీపుష్పయాగం, ప్లవోత్సవం (తెప్పలు), వరలక్ష్మీవ్రతం వగైరా నిర్వహిస్తారు. ప్లవోత్సవంలో పనిలో పనిగా ముగ్గురు దేవుళ్లు తెప్పలలో విహరిస్తారు. తొలిరోజు కృష్ణస్వామి, మలిరోజు సుందర రాజస్వామి తక్కిన మూడురోజులు పద్మావతమ్మ విహరిస్తారు. వసంతోత్సవాలలో స్వర్ణ రథంపై అమ్మవారు ఊరేగుతారు. నవరాత్రి ఉత్సవాలు అమ్మవారికి నిర్వహిస్తారు. గోకులాష్టమి రోజున బలరామకృష్ణులకు విశేషపూజలు జరుగుతాయి. సుందరరాజస్వామికి అవతారోత్సవాలు మూడురోజులు పాటు జరుగుతాయి. యోగిమల్ల



వరంలోని పరాశరేశ్వరస్వామికి ఆ ఆలయ నియమాలననుసరించి పూజలు జరుగుతాయి. అది దేవస్థానానికి (తి.తి.దే.) చెందిన ఆలయం కాదు. కానీ ప్రాచీనమైనది. అక్కడ మొత్తం 11 శిలాశాసనాలున్నాయి.

తిరుచానూరు తిరుపతికి నాలుగైదు కి.మీ. దూరంలో ఉన్నా ప్రస్తుతం దాదాపు తిరుపతిలో కలిసిపోయినట్టు కనిపిస్తుంది. రామానుజాచార్యులు తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామిని ప్రతిష్ఠించి నాలుగుమాడవీధులు నిర్మించిన తరువాతనే తిరుపతి అభివృద్ధి చెందింది. అంతకుమునుపు ఆ ఆలయంలో పార్థసారథి, ఆండాలమ్మలు ఒక చిన్న ఆలయంలో ఉండేవారు. ఊరుకూడ అప్పటికి ఏర్పడలేదు. రామానుజుల రాకతో తిరుపతి అభివృద్ధి గాంచింది. దాంతో తిరుచానూరు ప్రాముఖ్యం తగ్గింది. అయినా ఎఱ్ఱచందనం బొమ్మల తయారీకి, పంచలోహ విగ్రహాల తయారీకి ఇది పెట్టింది పేరు. యోగిమల్లవరంలో పరాశరేశ్వరస్వామి ఆలయంకాక కాళికామాత ఆలయమొకటి ప్రత్యేకంగా ఉంది.

* * * * *

## 3. అప్పలాయిగుంట – శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

తిరుపతికి 20 కి.మీ. దూరంలో తిరుచానూరునుంచి మద్రాసుకు (చెన్నై) పోవు దగ్గరిమార్గంలో అప్పలాయిగుంట ఉంది. తోరణద్వారం ఉండడంవల్ల సులభంగానే గుర్తించవచ్చు. ఇది ప్రసన్న వేంకటేశ్వరస్వామి పద్మావతీసమేతంగా వెలసిన చోటు. గోదాదేవి కూడా ఆలయంలో అమ్మవారికి సమాంతరంగా ఆమెలాగే వెలుపల ఉంది. ఎందుకోమరి? శ్రీ వేంకటేశ్వరుడు ఎప్పుడూ దేవేరులను దూరంగా పెడతాడు.

అన్షుణసరోవరం అప్పలాయిగుంటగా మారింది. ఇది ఆలయానికి దూరంలో ఉంది. పద్మాకరం. ఆ పద్మాలన్నీ పూజకు ముఖ్యంగా పద్మావతమ్మపూజకు వినియోగిస్తారు. ఆ ఊరిలో ఒక అప్పులయ్య ఉండేవాడు. అందరి దగ్గర అప్పు చేసేవాడు. ఒకని దగ్గర అప్పుచేయలేదు. కానీ అందరూ నమ్ముతారు కాబట్టి వాడు కూడా తనకు అప్పులయ్య బాకీ ఉన్నాడని వ్యాజ్యం చేశాడు. అప్పుడు అప్పులయ్యకు కోపం వచ్చి ఒక రాతి మీద నేను ఋణం చేయలేదు' అని వ్రాసి ఆ కోనేరులో వదిలితే అది మునిగిపోకుండా తేలిందట. అందువల్ల అది అన్షుణ సరోవరమని పిలువబడి క్రమంగా అప్పులయ్యగుంట ఆ తరువాత అప్పలాయిగుంటగా మారిందని పుక్కిటి పురాణం.

తిరుమల శ్రీవారు నారాయణవనంలో పద్మావతమ్మను వివాహమాడి పసుపు గుడ్డలతోనే తిరుమలకు మరవలిబయలుదేరి వస్తూ ఇచ్చోట మంచిగా ఉందని కాసేపు విశ్రాంతికై కూర్చున్నాడు. అక్కడ సిద్ధేశ్వరయోగి అనే ఆయన తపస్సు చేసుకుంటూ కళ్లు తెరిచి చూసి ఎదుట దివ్యదంపతులు కనబడేసరికి తబ్బిబ్బై వారి పాదాలమీదబడి అక్కడే వారిని ఉండిపొమ్మని ప్రార్థించాడు. స్వామి చిరునవ్వుతో తమ విగ్రహాలు అనుగ్రహించాడు. అలా వెలసినాడు ప్రసన్న వేంకటేశ్వరుడు.



ఈ ఆలయం ఎప్పుడు నిర్మించారో తెలియదు. కానీ దీని ముఖద్వారగోడమీద క్రీ.శ. 1585 కాలంనాటి వేంకటపతిరాయల దానశాసనముంది. కాబట్టి ఆలయం అంతకు మునుపే నిర్మింపబడి ఉంటుంది. స్థానికంగా కార్వేటినగర రాజులున్నారు గాబట్టి ఆలయ ఆలన పాలనా వారే చూసుకొంటూ వచ్చారు. తి.తి.దే. ఈ ఆలయాన్ని స్వాధీన పరచుకొని జీర్ణోద్ధరణచేసి, 30 ఏప్రిల్ 2006న మహాసంప్రోక్షణ చేసి అభివృద్ధి చేస్తున్నారు.

ఈ ఆలయంలో ఏటేటా బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవం నిర్వహించ బడుతోంది. స్వామి ప్రసన్నవదనంతో అభయహస్తంతో మనకు అభయమిస్తున్నాడు. రోగాలబారిన పడిన భక్తులు ఇక్కడి భారీ వాయునందనునికి మొక్కి రోగ విముక్తులవుతుంటారు. తిరుపతి డిపోనుంచి ఆర్.టి.సి. బస్సులు, చుట్టుప్రక్కల గ్రామాలనుంచి ఆటోలు వచ్చి పోతుంటాయి.

తిరుచానూరు శాసనాలలో పేర్కొనబడిన తిరువిలంకోయిల్ పెరుమానాడిగల్, తిరుమంత్రశాలై పెరుమానాడిగల్, తిరువేంకటత్తు పెరుమానాడిగల్ అను వారలు భోగశ్రీనివాస, కొలువుశ్రీనివాస, ఉగ్ర శ్రీనివాస అని మనం భావించినాము కానీ అర్చామూర్తి విగ్రహం ఒక్కటీ లేకపోవడం ఒకింత ఆశ్చర్యమే. సమీపంలో ఉన్న, అర్చామూర్తులు శ్రీనివాసమంగాపుర కల్యాణ వేంకటేశ్వరస్వామి, అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి. శాసనాలలో కొన్నిచోట్ల ప్రసన్నవేంకటేశ, కల్యాణవేంకటేశ అని కూడా సంబోధించడం కద్దు. ఇవన్నీ తిరుమలేశుని గూర్చి సంబోధించారా లేక విడిగా ఇతర ప్రదేశాలలో ఆ పేరులతోనున్న వారిని సంబోధించారా అన్న విషయం పరిశోధించినాక తేల్చవలసిన విషయం. తిరుమల ఆలయ వ్యవహారాలు తొలుత తిరుచానూరు కేంద్రంగా తదుపరి తిరుమల కేంద్రంగా

నడిచినాయి. స్థానత్తారులు, సభైయారులు అక్కడే ఉండేవారు. శాసనాలు, రికార్డులు గనుక అక్కడే వేయించేవారు. అందువల్ల ఇది ఖచ్చితమని ఏదీ తేల్చిచెప్పలేము.

తిరుమండ్యం సభవారు తిరుచానూరు సభవారి దగ్గర 23 బంగారు నాణేలు తీసికొని 24 దీపాలకు బదులుగా 2 దీపాలు మాత్రం వెలిగించి కొర్రమంగళముడైయాన్ అనే చోళ అధికారి అభిశంసనకు గురికావడం ఇలాంటిదే. ఏ సౌకర్యాలు లేని ఆ కాలంలో వీరు తిరుమలలో దీపాలు వెలిగించేవారా లేక వారి గ్రామ సమీపాననున్న అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వరుని దగ్గర వెలిగించేవారా అన్నది ఆలోచించవలసిన విషయం. ఈ ప్రసన్న వేంకటేశునికి ప్రణామాలు అర్పిద్దాం.

* * * * *

# 4. కార్వేటినగరం – శ్రీ వేణుగోపాలస్వామి

తిరుపతికి 58 కి.మీ.దూరంలో ఉన్న ఈ ఊరు కాడు–వేట్టి నగరం – అడవిని కొట్టి చదునుచేసి నిర్మించిన నగరం అని అర్థం. కార్వేటినగరం రాజులు దీనిని పరిపాలించారు. వారు సూర్యవంశరాజులు. కరికాలచోళునికి మనుమడైన తొండమాన్ ఇళయాన్ తిరయాన్‌కు నారాయణరాజు అని మనుమడు ఉండేవాడు. అతనే కార్వేటినగరరాజులకు మూలపురుషుడట. నారాయణవనం అతని పేరుమీదే వెలసింది.

ఈ ప్రాంతాన్ని తొలిచోళరాజులు, పల్లవులు, మలిచోళరాజులు, యాదవులు, విజయనగరరాజులు ఇలా అందరి రాజుల తరువాత కార్వేటినగర రాజులు పాలించారు. ఇక్కడున్న వేణుగోపాలస్వామిని చేరుకోవడానికి అప్పలాయిగుంట నుంచే రెండు మార్గాలలో రావచ్చు. మొదటిది పుత్తూరు మీద, రెండవది రాయలచెరువు, పచ్చికాపలంమీద, రెండవదారి కొండలు గుట్టలతో ప్రకృతి రమణీయంగా ఉంటుంది.

యాదవరాజులు తమ పాలనలో అనేక కృష్ణాలయాలు నిర్మించారుగదా. అందులో ఇది కూడ ఒకటి అని అందరి భావన. అయినా కతారి సాళ్వమాకరాజు వేంకట పెరుమాళ్‌రాజు ఈ ఆలయాన్ని క్రీ.శ.1719లో నిర్మించాడని కొందరంటారు. అది నూతన నిర్మాణమో లేక జీర్ణోద్ధరణో తెలియదు. ఈ ఆలయ ఆవరణలోని బండలమీద చోళరాజు త్రిభువన చక్రవర్తి మూడవ రాజరాజ దేవ, శిథిల శాసనముంది. 4 శివాలయాలకు భూదానం చేసినట్టుంది. వీర నరసింగదేవ యాదవరాయ, ఒక సాళ్వరాజు పేర్లున్నాయి.

ఈ ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేతుడై వేణుగోపాలస్వామి కొలువై ఉన్నాడు. మరొక ఉపాలయంలో హనుమత్సమేత సీతారామలక్ష్మణులు నెలకొని ఉన్నారు. ఇక్కడి రాజగోపురాన్ని 30 లక్షల

రూపాయలతో జీర్ణోద్ధరణ చేసి 2006 మే 7వ తారీఖున తి.తి.దే. కలశ ప్రతిష్ఠాపన చేశారు. ఇక్కడ విశాలమైన స్కందపుష్కరిణి అందంగా ఉంటుంది. దాని గట్టున స్వామి లక్ష్మణాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరిదేవి ఆలయం ఉంది.

శ్రీ వేణుగోపాలస్వామికి 9 రోజుల బ్రహ్మోత్సవం, 3 రోజుల తెప్పోత్సవం, 2 రోజుల పవిత్రోత్సవం విశేషంగా జరుగుతాయి. గోకులాష్టమి పూజలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. మూల విరాట్టులైన వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామలకు వెనుకవైపు గోవు ప్రతిష్ఠితమై ఉంది. ఉత్సవమూర్తులు ఊరేగింపునకు వచ్చువేళ వారి వెంబడి మెరవణ చేయబడు వెండిగోవు ఎంతో సుందరమైనది. అందరి దృష్టి దానిమీదే ఉంటుంది. 1989లో ఈ దేవాలయం తి.తి.దే. వారి స్వాధీనమైనది.

ఈ స్వామి తొలుత పాపవినాశం కాలిదారిలోని సమాధులు దగ్గర అంటే ప్రస్తుతం హథీరాంజీమఠంవారి వేణుగోపాలస్వామి ఆలయం దగ్గర ఉండేవాడట. రెడ్డి రాజులకు తిరుమల తిరుపతితో గల సంబంధం వల్ల వారు ఆ మూలవిరాట్టును తెచ్చి నిశ్శంకుదుర్గంలో వేణుగోపాలస్వామికి ఆలయం నిర్మించి అందులో ప్రతిష్ఠించారట. బహుశా ఇది సాళువ నరసారెడ్డిని పిఠాపురంనుంచి రప్పించి చాళుక్య చోళ భూపతి విమలాదిత్యుడు ఆయనకు శేషాచలాన్ని పాలించే బాధ్యతను అప్పగించి నప్పటిదై ఉండవచ్చును. తరువాత కార్వేటినగర రాజులు నిశ్శంకు దుర్గంనుంచి ఆ మూలవిరాట్టును తెచ్చి తమ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతిష్ఠించుకొన్నారు.

నిశ్శంకు దుర్గం కార్వేటినగరానికి ఏడెనిమిది కి.మీ. దూరంలో నగరి కొండల్లో ఉంది. నారాయణవనానికి ఇంకా సమీపంగా వుంది. దీనిని నిశ్శంకుమల్లుడు (పల్లవ పెరుంజంగన్ కుమారుడు కొప్పెడుజంగన్) తెలుంగర్‌ను (కాకతి గణపతిదేవుడు) ఉత్తరాదికి తరిమినప్పుడు భద్రతకు



దీనిని నిర్మించి ఉంటాడని ప్రతీతి. నారాయణవనాన్ని ఏలిన రాజవంశా లన్నిటికీ ఈ నిశ్శంకుదుర్గం కేంద్రస్థానంగా అలరారినది.

తిరుమల శ్రీనివాసుడు ఆకాశరాజుకు, ఆతని తమ్ముడైన తొండమాన్ చక్రవర్తికి అల్లుడు. ఆ వంశీకులైన కార్వేటినగర రాజులకు కూడ ఆయన జామాత. అందుకే వారు దర్శనానికి తిరుమల వచ్చినప్పుడు రాజ మర్యాదలతో వారిని గౌరవించి ఆతిథ్యం పలికి ఆలయంలోకి తీసుకపోయి ప్రత్యేక దర్శనం చేయించేవారు. కార్వేటినగర రాజులు ఇప్పుడు లేరుగానీ ఉన్నప్పుడు వారీ దేవాలయాలన్నిటికీ ధర్మకర్తలు. తిరువళ్ళూరు, తిరుత్తణి, తిరువాలంగాడు (తమిళనాడులోనివి) నాగలాపురం, నారాయణవనం, అప్పలాయిగుంట వగైరాలు. వారి భాగ్యమే భాగ్యం. తమిళనాడులో కొంత భాగాన్ని ఏలినారు. తిరుత్తణి, అత్తిమంజేరిపేట తాలూకాలు.

సాళువరెడ్లకు, కార్వేటినగర సంస్థానాధీశులకు వచ్చిన వైరం వల్ల సాళువరెడ్లవంశం నిశ్శేషంగా నాశనమైందని, వారు చనిపోతూ పెట్టిన శాపం వల్ల కార్వేటినగర వంశంకూడ ఏడుతరాల తరువాత నాశనమైందని ఇప్పుడెవరూ ఆ వంశంవారు లేరని అందరికీ తెలిసిన విషయం. ఈ కథకు సంబంధించిన సాళువరెడ్లు మొదటితరంవారు కాదనిపిస్తోంది. రెండవ తరానికి చెందిన నందిగుంట వెంకారెడ్డి కుటుంబంగా తోస్తోంది. వీరందరూ నశించినా వీరి వంశంలోని ఒక ఆడబిడ్డ బంగారమ్మ బతికి బట్టకట్టి చివరకు దేవతగా మారిపోయింది. ఆమే నేటి కార్వేటినగర గ్రామ దేవత. బంగారుగంగమ్మగా ఆమెకు జాతర తిరుణాల జరుగుతుంది.

కార్వేటినగర రాజులు మంచి కళాపోషకులు. వీరి ఆస్థానంలో దిగ్గజ కవులుండేవారు. శ్రీ భారతీ లీలాసదన ముద్రాక్షరశాల యను ముద్రణాలయం 1884 సంవత్సరం నాటికే స్థాపించబడియుండేది. అందులో ఎన్నో ఉత్తమగ్రంథాలు ముద్రింపబడినాయి. మంచి జ్యోతిష పండితులచే

కార్వేటినగర సంస్థాన పంచాంగం కూడ ప్రకటించ బడుచుండెను. హథీరాంజీ మఠం మహంతులు దానినే తి.తి.దేవస్థాన పంచాంగముగ 1935 వరకు గ్రహించినారు.

కార్వేటినగర కవులలో పోలిపెద్ది వెంకట్రాయకవి ప్రసిద్ధుడు. ఈయన వేణుగోపాల శతకమును "మదరిపు విఫాలమునిజన హృదయలోల, వేణుగోపాల భక్తజన సంత్రాణశీల" అను మకుటంతో రచించినాడు. ఆ వేణుగోపాలస్వామికే అంకితమిచ్చినాడు. సారంగపాణి ప్రఖ్యాత పదకవి. ఆయన సారంగపాణి (వేణుగోపాలపదములు) రచించినాడు. గ్రామదేవత బంగారమ్మను గూర్చి "బాలవేణుగోపాలసోదరి, కంబుకంఠి" అని కీర్తించినాడు. సారంగపాణి గరుడసేవను వర్ణిస్తూ ఆయన పాడిన పాట–

**"కదలీ వచ్చెను జూడరే వేణుగోపాలుడు కనుల పండుగగాను**
**పదిలుడై గరుడనిపై నెక్కి భక్తుల**
**ముదమొందజేయుచు ఇదిగొ రాజమార్గమున"**

ఈ గరుడవాహనం 40 మంది మోసేటంత పెద్దదట. కంచి గరుడసేవకు వాడేటంత పరిమాణం గలది.

కార్వేటి నగరాధీశుడైన ఇమ్మడి నరసింహుడు చంద్రగిరికోటను క్రీ.శ. 1000 సంవత్సరమున నిర్మించినాడని అక్కడ వ్రాసి పెట్టబడి ఉంది. ఇతడు యాదవరాజు. సూర్యవంశజులైన కార్వేటినగరంవారికి అనంతరాజుపేట మట్లవారికి బంధుత్వముంది.

* * * * *

# 5. నారాయణవనం – శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

తిరుపతికి దాదాపు 40 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామం ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది. పైగా ఈ ప్రాంతానికంతా అతి పురాతనమైనది. పురాణాలలో నారాయణపురం అని పేర్కొన్నారు. పల్లవులు అలాగే పిలిచారు. చోళచక్రవర్తులు నారాయణవనం అన్నారు. విజయనగర చక్రవర్తుల కాలంలో నారాయణవరం అని పిలువబడింది. స్థానికులు నాన్నారం అంటారు.

ఇది ఒకప్పుడు ఆకాశరాజు ఏలిన పట్టణం. తొండమాను చక్రవర్తి ఆకాశరాజుకు తమ్ముడుగా ఆశించిన కేంద్రం. పద్మావతిదేవి పెరిగినచోటు. తిరుమలేశునికి అత్తగారిల్లు. పైగా వివాహం జరిగినచోటు. ఆ వివాహాన్ని వీక్షించడానికి వచ్చిన ముక్కోటిదేవతలు ముఖ్యంగా శివుడు, శివగణాలు ఈ చోటును వదలిపోలేక పరిసరాలలో ప్రవాసులుగా ఉండిపోయారు. సదాశివకోన, కైలాసనాథకోన, రామగిరి, సురుటుపల్లి మొదలగు పవిత్ర తీర్థాలలో – పుణ్యక్షేత్రాలలో స్థావరం ఏర్పరచుకొన్నారు.

సూర్యవంశజుడైన కరికాలచోళుని మనుమడు తొండమాన్ ఇళయాన్ తిరయాన్. ఆతని మనుమడు నారాయణరాజు. ఇతని పేరుమీద ఈ ఊరు స్థాపించబడినదని పదిమంది విశ్వాసం. కార్వేటినగర రాజులకు ఈయనే మూలపురుషుడని వారే చెప్పుకొన్నారు. శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో ఒక చోళరాజు కనిపిస్తాడు. చోళరాజులు మహాభారత కాలంనుంచీ ఉన్నారు. కౌరవులవైపు పోరాడినారు. కావున శ్రీ వేంకటాచల మాహాత్మ్యమునకు కాల నిర్ణయం జరుగలేదు. కానీ కలియుగ ప్రారంభంలో జరిగినదనుటలో సందేహం లేదు. అంటే కనీసం 5వేల సంవత్సరాల క్రితం జరిగినదన్నమాట. కావున ఈవూరి వయసు అంతన్నమాట.

పద్మావతమ్మ తాను పద్మసాలీల ఆడపడుచునని తాళ్లపాక చిన్నన్నకు సాక్ష్యమిచ్చినది గావున ఈ గ్రామమంతా వారే నిండియున్నారు. ఆలయంలో

పద్మావతమ్మ గుడిముందు ఒక పెద్ద తిరగలిరాయి మనం తిప్పలేనంతది, ఆ కాలంలో వారు విసురుదుకు ఉపయోగించినది పడి ఉన్నది గాన ఆలయం అప్పటిదే కావచ్చు. ఇప్పటికి ఎన్నో జీర్ణోద్ధరణలు జరిగి ఉండవచ్చు. విసురుదు రాయిని మాత్రం పెండ్లివంటలకు ప్రత్యక్ష సాక్ష్యంగా పదిలపరచి ఉంటారు.

ఇది అరుణానదిలోయ. అరుణానది ఊరిని చుట్టి శ్రీవారి కనుసన్నలలో ప్రవహిస్తుంది. నదికి ఇవతల నారాయణవనం, అవతల కెంపుల పాళ్యం. ఆకాశరాజు ఇలవేల్పు అవనాక్షమ్మ స్థావరం. ఆయనకాలంలో మట్టికోట కూడా ఇక్కడే ఉండేది. ఇక్కడ ఉన్న రాములవారిని ఆవైపుకు తరలించడంతో ఇది పూర్తిగా శివపురి అయిపోయింది. అవతల ఏమో విష్ణుపురి. కాంచీపురంలోని శివకంచి, విష్ణుకంచిలాగ. ఇక్కడ మరకతవల్లీసమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి (తిరువఘట్టాశురముడైయనాయనార్) సేనాపతి చండికేశ్వరులు, గణాధిపతి విఘ్నేశ్వరులతో కూడిన ఆలయం, పరాశరేశ్వర ఆలయం, వీరభద్ర ఆలయం, శక్తి వినాయక ఆలయం అన్నిటికీ మించి శక్తి స్వరూపిణి, మహిషాసురమర్ధిని అయిన అవనాక్షమ్మ ఆలయం ఇవన్నీ ఈ కెంపులపాళెంలో (కీళగరం – సముదాయం) ఉన్నాయి. నిత్యపూజలు అందుకుంటున్నాయి. అష్టభుజి అయిన అవనాక్షమ్మను ఒంటరిగా చూడాలంటే కాస్త భయంగా ఉంటుంది. మూడంతస్థుల ముచ్చటైన రాజగోపురం క్రిందనే అమ్మవారుంటారు. ఆలయంలో అక్కడక్కడా అమ్మవారి బొమ్మలు శిల్పించబడ్డాయి. అంతకుమించిన శిల్పకళ కానరాదు. అన్ని కళలు అమ్మవారి విగ్రహంలోనే అమరి ఉన్నాయి. ఇక్కడ క్రీ.శ. 1747లో మహామండలేశ్వరుడు శేషాచలపతి రాజుదేవమహారాజు సభామండపం జీర్ణోద్ధరణ చేశాడు.

ఏడంతస్తుల రాజగోపురంలో వెలిగిపోతున్న ఎందరో దేవతామూర్తులకు నెలవైన నారాయణపుర ఆలయంలో కల్యాణ వెంకన్న కొలువై ఉన్నాడు.



ఈయన ఇక్కడకు రావడం వెనుక ఒక కథ ఉంది. అదే శ్రీ వేంకటాచల మాహాత్మ్యంగా పేరు గాంచింది.

దేవతలు గంగానది ఒడ్డున ఒక యజ్ఞం తలపెడతారు. దారిన పోతున్న నారదమహర్షి ఆ యజ్ఞఫలం ఎవరికి ఇస్తారు అని దేవతలను ప్రశ్నిస్తాడు. అప్పుడు అక్కడ ఉన్న భృగుమహర్షి త్రిమూర్తులలో ఎవరు ఉత్తములో తేల్చుకొని వస్తానని బయలుదేరి ముందుగా బ్రహ్మలోకం పోతాడు. బ్రహ్మ సరస్వతితో ఉండడం గమనించి ఆయనకు ఆలయమే ఉండదని శపించి అక్కడినుంచి కైలాసం పోతాడు. కైలాసంలో శివుడు పార్వతితో గడవడం గమనించి ఆయనకు లింగపూజే శరణ్యమని శపించి అక్కడినుంచి వైకుంఠం పోతాడు. వైకుంఠంలో విష్ణుమూర్తి మహాలక్ష్మితో మహదానందంలో ఉండగా చూసి కోపం పట్టలేక కాలితో ఆయన వక్షఃస్థలాన్ని తన్నుతాడు. వక్షః స్థలవాసియైన మహాలక్ష్మికి దెబ్బతగిలి ఆమె కోపగించుకుంటుంది. శ్రీ మహావిష్ణువు ఆమెను ఓదార్చకుండా స్వామి పాదాలకు నొప్పి కలిగి ఉంటుందని ఆ భృగుమహర్షి పాదాలు ఒత్తుతూ ఆ పాదాలలో ఉన్న కన్నును పీకివేసి ఆయనకు గర్వభంగం కలిగిస్తాడు. గర్వభంగమైన భృగువు పాదాలు పట్టుకున్న విష్ణుమూర్తి ఉత్తముడని భావించి వెళ్ళిపోతాడు. కాలి తన్ను తిన్న తనను ఓదార్చక, తన్నిన వాని పాదాలు పిసికిన విష్ణువుమీద కినుక వహించి వద్దన్నా వినక అలిగి లక్ష్మీదేవి కొల్హాపురం వెళ్లిపోతుంది.

వైకుంఠంలో ఆడదిలేని కాపురం చేయలేక, ఒంటరిగా ఉండలేక విష్ణుమూర్తి ఆమెను వెదుక్కుంటూ ఇదివరకే క్రీడాపర్వతం చేరివున్న శేషాచలానికి వస్తాడు. అక్కడ చేయునది లేక తపస్సుకు ఉపక్రమిస్తాడు. మానవశరీరం దాల్చినందువల్ల శ్రీనివాసమూర్తిగా మారినందువల్ల ఆకలి దహించి వేస్తుంది. ఆ ఆకలిసెగ కొల్హాపురంలోని లక్ష్మీదేవికి సోకుతుంది. అసలు విషయం గ్రహించి ఆమె బ్రహ్మదేవుని గోవుగా ఈశ్వరుణ్ణి దూడగా మార్చి చంద్రగిరిని పాలించే చోళరాజు దగ్గరకు గోపికగా వచ్చి వాటిని

అమ్మివేస్తుంది. ఆవు తొలిరోజు బాగా పాలిచ్చింది. అడవికి మేతకు తోలగా మేస్తూపోయి శేషాచలం కొండెక్కి పుట్టలోని స్వామికి ధారగా పాలు విడిచి వట్టిపొదుగుతో ఆస్థానానికి వస్తుంది. రాజు భార్య ధరణీదేవి గొల్లవాణ్ణి మందలిస్తుంది. మరుసటిరోజు వాడు ఆవుకు కావలి కాసి ఆవు చేస్తున్న పనిని చూసి కోపంతో గొడ్డలి విసురుతాడు. ఆవును కాపాడాలని శ్రీనివాసమూర్తి పుట్టలోంచి బయటరాగా ఆయనకు గొడ్డలి తగిలి నెత్తిమీద గాయమవుతుంది. దానిని చూసి గొల్ల మూర్ఛపోతాడు. చోళరాజుకు బ్రహ్మరాక్షసిగా శాపం తగిలి తరువాత ఆకాశరాజుగా జన్మించేవరం లభ్యమౌతుంది.

ఆకాశరాజు నారాయణవరంలో జన్మిస్తాడు. తొండమానుడు ఆయనకు తమ్ముడుగా పుడతాడు. బిడ్డలకోసం ఆకాశరాజు యజ్ఞం తలపెట్టి యజ్ఞభూమి దున్నుతుండగా సహస్రదళ పద్మంలో శిశువు పద్మావతమ్మ దొరికింది. ఇక యజ్ఞం అనవసరమని భావించి ఆ బిడ్డను తీసుకపోయి ఆకాశరాజు సాకినాడు. ఆమె పద్మావతిదేవిగా పెరిగి పెద్దదైంది.

దెబ్బ తిన్న శ్రీనివాసుడు వైద్యం చేసికొందామని వనమూలికల కోసం అన్వేషిస్తూండగా వరాహమూర్తి ఆయన్ను చూసి తన అనుమతి లేకుండా వరాహక్షేత్రంలో అడుగు బెట్టినందుకు ఆక్షేపిస్తాడు. ఇద్దరూ కాసేపు మాట్లాడుకొన్నాక తామిద్దరూ విష్ణుఅంశంలో తమతమ కర్తవ్య నిర్వహణకు వచ్చిన వారమని గ్రహించి సన్నిహితులౌతారు. వరాహస్వామి శ్రీనివాసుని తన విడిదికి తీసుకపోగా అక్కడ వంట చేస్తున్న వకుళమాత (మునుపటి యశోద) శ్రీనివాసుని చూసి తన బిడ్డడు (శ్రీకృష్ణుడు) వచ్చినాడని సంతోషించి వైద్యం చేసి గాయం మాన్పుతుంది.

అమ్మకొడుకులు కలుసుకొన్నాక, వరాహస్వామికి మొదటిపూజ, మొదటి నైవేద్యం, మొదటిదర్శనం కలిగేట్టు మాట ఇచ్చి దానికి బదులుగా



కొంత స్థలాన్ని పొంది అక్కడ ఆశ్రమం నిర్మించుకొని హాయిగా ఉంటారు. ఒకరోజు ఒక మదపుటేనుగు ఆశ్రమానికొచ్చి అల్లకల్లోలం చేస్తుంది. శ్రీనివాసుడు అడవి గుఱ్ఱాన్ని ఎక్కి దానిని తరుముకుంటాడు. అది చాలా దూరం పోయి నారాయణపుర పరిసర ఉద్యానవనంలో పచార్లు చేస్తున్న పద్మావతిదేవి స్వామి కంటపడేటట్టు చేసి అదృశ్యమౌతుంది. పద్మావతి శ్రీనివాసులు ఒకరినొకరు చూసుకొన్నారు. ప్రేమించుకొన్నారు. విడిచి బ్రతకలేమని భీష్మించుకొన్నారు. వకుళమాత దౌత్యంతో, నారదముని జోక్యంతో, స్వామి ఎరుకలసాని వేషంతో చెప్పిన సోదెతో పరిస్థితులు సానుకూలమై కుబేరుడు ఇచ్చిన 14 కోట్ల అప్పుతో పెళ్లి అంగరంగ వైభోగంతో జరిగి అంతా ప్రశాంతంగా ముగిసింది. రామావతారంలో రాములవారు సీతమ్మకు ఇచ్చిన మాట ప్రకారం పద్మావతి రూపంలో వున్న వేదవతిని శ్రీనివాసుడుగా పరిణయమాడినాడు. అత్తగారింటి నుంచి పసుపు గుడ్డలతో మరవలి వస్తూ దారిలో అప్పలాయిగుంటను, తొండవాడను, శ్రీనివాస మంగాపురాన్ని పునీతం చేసి తిరుమల చేరినాడు. తల్లికోరిక తీర్చినాడు. దేవేరి కోరిక తీర్చినాడు. మనకోసం కలియుగదైవమై అర్చావతారమూర్తిగా స్వయంభూగా తిరుమలలో నెలకొన్నాడు.

ఇది నారాయణవనంతో స్వామికున్న ఎడతెగని సంబంధం. నారాయణపురంలో తొలి ఆలయ నిర్మాత ఆకాశరాజుగా పరిగణన. అల్లుడు కూతుర్లను యౌవనవంతులుగా తీర్చిదిద్దినాడు. శతాబ్దాలు గడిచేసరికి ఎందరోరాజులు పల్లవులు, చోళులు, యాదవరాజులు, సాళువరెడ్లు, కార్వేటి నగర రాజులు ఎన్నో జీర్ణోద్ధరణలుచేసి ఎందరో దేవతామూర్తులను ప్రతిష్ఠించినారు. ఆళ్వారులు, దశావతారాలు, వరదరాజస్వామి, ఆండాలమ్మ (గోదాదేవి), కోదండరాములవారు, రంగనాయకస్వామి, రాజమన్నారు స్వామి, ప్రయాగమాధవరాయస్వామి ఇలా ఇక్కడలేని దేవుడంటూ ఎవరూ లేరనేటట్టు ప్రతిష్ఠించినారు. ఎవరు ఎవరిని ప్రతిష్ఠించారో మాత్రం

తెలియదు. ఉత్సవ విగ్రహాలలో కోదండరాముడు సుందరంగా త్రిభంగి రూపంలో, ఆండాలమ్మ ప్రక్కకొప్పుతో పక్కాగా, ఆంజనేయస్వామి అతి వినయంతో అంజలిబద్ధుడై ఆకర్షిస్తారు. ఆలయ రాజగోపురం ఎత్తు 963 అడుగులు.

ఆలయపుష్కరిణి ఊరికి దూరంగా ఉంది. అందులో ప్లవోత్సవం ప్రతి సంవత్సరమూ జరుగుతుంది. అలాగే బ్రహ్మోత్సవమూను. ఇంకా పవిత్రోత్సవం ఇతర ముఖ్యపండుగలన్నీ జరుపుతారు. ఈ ఆలయ సముదాయాన్ని విష్ణునగరిగా భావించవచ్చు. నారాయణవనం పేరుకు తగ్గట్టు వనశోభతో వరవరలాడుతుంటుంది. సన్నిధివీథి ఆంజనేయస్వామికి ఆనుకొని సొరకాయస్వామి ఆలయముంది. ఆయనొక అవధూత. పరిసర ప్రాంతాలలో ప్రసిద్ధుడు. ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడు బడితే అప్పుడు ఆయన జీవనకాలం 200 సంవత్సరాలు కనబడుతూ ఉండేవాడు, భక్త జనాశ్రయుడు. ప్రకృతిని శాసించేవాడు. మద్రాసు నుంచి మెయిల్‌లో వచ్చేటప్పుడు అనుచరుడొక్కడు రైలెక్కలేదని మెయిల్ కదలకుండా సెంట్రల్లోనే శాసించాడు. అనుచరుడు ఎక్కాక రైలును చేతికర్రతో సంజ్ఞచేసి కదలనిచ్చాడు. ఇలాంటివి ఎన్నో కథలు.ఎవరు ఏ ఊరి నుంచి ఆయనను చూడడానికి వస్తున్నారో నారాయణవనంలో కూర్చుని అందరికీ చెప్పేవాడు. 'ఈ కుక్క', 'ఆ కుక్క' పనికిమాలిన కుక్క ఇలాంటి పదాలతో భక్తులను సంబోధించేవాడు.

తిరుపతి పరిసరాలలో ఒక యాదవకులంలో పుట్టాడట. నెత్తిన టోపీలాంటి తలగుడ్డ, మోకాళ్లదాకా ముతక పంచె, నొసటన, వళ్లంతా వేంకటేశ్వర తిరునామాలు, పొట్టిగా పింజారిగా పొడిపొడిగా అడుగులు వేస్తూ, వీపున సొరకాయల బుర్రలనేకం (వాటర్‌బాటిల్స్) జోలె, భిక్షా పాత్ర కలిగి కుక్కల సమూహంతో దత్తాత్రేయుడి అవతారంలో కనిపించేవాడు. ఒకసారి భక్తులు ఈ స్వామిని తిరుమలేశుని దర్శనానికి పట్టుకపోయాక



ఉన్నట్టుండి అదృశ్యమైపోయాడట. అవతల భక్తులు స్వామిని దర్శించేటప్పుడు స్వామి విగ్రహంలోంచి బయటకు వస్తూ కనిపించాడట. అదీ ఆయన ఘనత. పుత్తూరు ధర్మశాల శంఖుస్థాపన రికార్డులు చూసి ఆయన వయస్సు 200 సంవత్సరాలని తేల్చినారు. అందరి ముందు దీపం వెలిగించాడు. కొబ్బరికాయ పగులగొట్టినాడు. బెంచ్‌మీద పడుకున్నాడు. బిందెలకొద్దీ తనమీద నీళ్లు పోయమన్నాడు. భౌతికదేహం విసర్జించినాడు. పరమాత్మునిలో ఐక్యమైనాడు. ఆయన అస్థికలమీదనే ప్రస్తుత గుడిగట్టినారు. అదీ ఆ మహాత్ముని మహాపరినిర్వాణం. మనవారికంటే మద్రాసు భక్తులు ఆయనకు అన్నీ పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అదీ సిద్ధులైన సొరకాయలస్వామివారి సంక్షిప్త చరిత్ర.

అచ్యుతదేవరాయల ఆంతరంగిక మంత్రి విరూపణ్ణ ఈ కల్యాణవెంకన్న ఆలయాన్ని క్రీ.శ.1541-42 ప్రాంతంలో నిర్మించినట్టు మద్రాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టు (1912) లో ఉంది. బహుశా ఇది జీర్ణోద్ధరణ కావచ్చు. క్రీ.శ.1622లో కొన్ని వర్తక సంఘాలు ఆలయానికి కొన్ని దానాలు చేశాయి. అదే సంవత్సరంలో చంద్రగిరి శ్రీరంగరాయల కుమారుడు తిరుమల రాయలు ఆలయంలో నిత్యధూపదీపనైవేద్యాలకై ఒక గ్రామాన్ని దానం చేసినాడు. పునాదులు మాత్రం సాళువ నరసింహరాయల కాలంలోనే పడినట్టు భావిస్తారు. యోగిమల్లవరంలోని పరాశరేశ్వరస్వామి ఆలయంతో బాటు ఈ ఆలయం కూడ తిరుత్తణి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉండేది. పటాస్కర్ అవార్డులో తిరుత్తణి తమిళనాడు రాష్ట్రానికి వెళ్లింది. సత్యవేడు తాలూకా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. అందువల్ల మన రాష్ట్రప్రభుత్వంవారు ఈ ఆలయానికి 1960లో ట్రస్టీల ఏర్పాటుచేసినారు. వారు 1964 నుంచి జీర్ణోద్ధరణ గావించి 1966 సంవత్సరంలో మహా సంప్రోక్షణ పూర్తిచేసినారు. 1967లో తి.తి.దే. వారు తమ ఆజమాయిషీలోకి ఈ ఆలయాన్ని తీసికొన్నారు.

శ్రీవారి కల్యాణంరోజు నీరు చాలకపోతే, ఆరుణీఅనే వనమూలికతో అరుణానదిని సృష్టించారట. ఇప్పు డా నదిమీదనే ఆరణియార్ ప్రాజెక్టు నిర్మించి పంటలకు నీరిస్తున్నారు. ఇక్కడికి 3. కి.మీ. దూరంలో కైలాస నాథకోన జలపాతం వుంది. అది నగరి ముక్కు కొండమధ్యభాగంనుంచి జాలువారుతుంది. పర్యాటక కేంద్రం.

నారాయణవనం పరిసరాలు కూడ ప్రాముఖ్యం వహించాయి. పశ్చిమంగా నగరికొండలలో నిర్మించిన నిశ్శంకదుర్గం మధ్యయుగాల రాజవంశాలకు ముఖ్యంగా నారాయణవనం ఏలిన రాజులకు దుర్గమకోటగా దుర్భేద్యమై అలరారింది. విజయనగరచక్రవర్తులులో రెండవవంశం వారయిన సాళువలకు ఇది జన్మస్థానం. దక్షిణవైపున్న నగరిముక్కు అనబడే కొండ తూర్పు ఇండియా కంపెనీ నౌకలకు మద్రాసు నౌకాశ్రయం చూపే లైట్‌హౌస్‌గా తోడ్పడింది. దానిమీద మంటలువేసి దారి చూపేవారు. దాని సానువుల్లోనే కైలాసనాథకోన జలపాతం జనించి అందరినీ ముఖ్యంగా చెన్నై వాసులను ఆకర్షిస్తోంది. కైలాసనాథస్వామి గుడి ఉంది. ఉత్తరంవైపు సదాశివకోన ఉంది. అక్కడా ఒక జలపాతం ఉంది. చిన్న శివాలయం ఉంది. మహాశివరాత్రికి విశేషజనం వస్తారు. దీనికి తూర్పువైపున అడవిలో శ్రీకాళహస్తికి ప్రాచీనమార్గం ఉంది. తొండమాన్ చక్రవర్తి నారాయణవన రాజ్యాన్ని పంచుకొన్నప్పుడు శ్రీకాళహస్తి సమీపంలోని తొండమనాడును రాజధానిగా చేసికొన్నాడు. అప్పుడీదారిలో పయనించే వాడేమో? దారిలో శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి ఆలయముంది. బహుశా సాళువ నరసింహుని నిర్మాణం కావచ్చు. స్థానకమూర్తి ఆలనాపాలనా లేక అనాథగా ఉన్నాడు.

* * * * *

# 6.నాగలాపురం - శ్రీ వేదనారాయణస్వామి

ఇది నాగులపురం. తిరుపతికి 65 కి.మీ. దూరంలో చెన్నై మార్గంలో ఉంది. త్రేతాయుగంలో సోమకాసురుడు వేదాలు దొంగిలించి కడలికేగగా, విష్ణుమూర్తి మత్స్యావతారమెత్తి ఆ రాక్షసుని సంహరించి వేదాలు కాపాడినప్పుడు ఇది అరిగండాపురం. అంటే శత్రువులకు గండమైనది. వైకుంఠంలో విష్ణుమూర్తి కనపడకపోగా చతుర్ముఖుడు వెదుక్కుంటూ వచ్చి శ్రీహరిని ఇక్కడ కాంచినందుకు ఇది హరిగండాపురం అంటే హరి కనబడిన చోటు. శాతవాహనుల పాలన అంతమయ్యే నాటికి ఈ దక్షిణాది ప్రాంతం మహాజనపదమని పిలువబడి మహాసేనాపతి స్కంధనాగుని పాలనకు రాగా నాగరాజ్యమైంది. విష్ణుమూర్తి చతుర్వేదాలను చేతికివ్వగా బ్రహ్మ వాటి ప్రచారానికి పూనుకోగా చతుర్వేది మంగళ నాగపుదోలి అయింది.

మూడవ కులోత్తుంగ చోళుని పాలన చివర్లో రాజమల్లదేవ యాదవరాయ అనే సామంతరాజు (భుజబల సిద్ధరసర్) నాగపుదోలిలో తన పూర్వీకుడైన యాదవనారాయణ పేరుతో ఒక ఆలయం నిర్మించాడు. అది కరియమాణిక్యపెరుమాళ్ ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. అది 13వ శతాబ్దంలో నిర్మితంకాగా ఏ కారణం చేతనో మూలవిగ్రహం భిన్నమైంది. అది ఎప్పుడు జరిగిందో తెలియదు.

దశావతారాలలో తొలిఅవతారంమత్స్యావతారం. పైగా కృతయుగంలోనే సంభవమైంది. అది కూడా నాగలాపురంలోనే జరిగింది. వేదోద్ధరణ చేసిన వేద నారాయణుడికి ఆలయం నిర్మించాలన్న ఆలోచన ఎవరికీ రాలేదు. అందువల్ల ఆ స్వామి తనంతటతానే చేయించుకున్నాడు. శ్రీకృష్ణదేవరాయలు మహామఖి ఉత్సవాలకు కుంభకోణం పోయి తిరుగు ప్రయాణంలో ఈ ఊరు వచ్చి యాదవ నారాయణస్వామి దర్శనం చేద్దామనుకోగా అసలు విషయం తెలిసింది.

ఊరిపేరు నాగలాపురం. తన తల్లిపేరు కూడా నాగులాంబ. యాదృచ్ఛికం. ఉండవలసింది వేదనారాయణుడు. ఉన్నది యాదవ నారాయణుడు. ఐతిహ్యం - సముద్రసమీపం కావున అవతారం నమ్మవలసిందే. కాబట్టి వేదనారాయణస్వామిగా ఆ ఆలయాన్ని జీర్ణోద్ధరణ ఎందుకు చేయకూడదు? చేయవలసిందేనని తీర్మానం చేసికొన్నాడు.తనకా అదృష్టం కలిగించడానికే యాదవనారాయణుడు భిన్నమైనాడన్న భావనకూడా కలిగింది.

వెంటనే ఆ ప్రాంత అధికారి హరిదాసును సంప్రదించాడు. అవిరి(డి) కాళప్పర్ తిరువేంగడముడైయాన్ అను అనైత్తల గుంకండ హరి హరసర్ అను ఆ ప్రాంతీయ అధికారి ఆలోచించి అది మంచి ఆలోచన అన్నాడు. 'మీ తండ్రి తన భార్య నాగులాంబ పేరిట హంపీలో నాగలాపురం నిర్మించాడు. మీరు మీతల్లి అయిన ఆమె పేరిట ఇక్కడ నాగలాపురం అభివృద్ధిచేసి ఆలయం అపురూపంగా నిర్మించండి' అని హరిదాసు సలహాయిచ్చాడు. ఇది క్రీ.శ. 1517లో జరిగింది.

రాజు తలచుకొంటే డబ్బులకు కొదవా? అంగరంగ వైభోగంగా ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. వేలమంది శిల్పులు పనిచేయసాగారు. డబ్బు ఒక్క సారిగా అవసరంలేదు. ఉన్నది రైతులకు అప్పిచ్చారు. వారు పంటలు పండిస్తూ కొద్ది కొద్దిగా ఇస్తూ ఉంటే ఆలయ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుంది. ఉభయతారకంగా ఉంది. అటు పాడిపంటలు. ఇటు ఆలయ నిర్మాణం. దాదాపు పది సంవత్సరాలు నిరాటంకంగా కొనసాగింది.

12 ఎకరాలలో ఆలయం మొదట ఏడు ప్రాకారాలు అనుకున్నారు. తరువాత ఐదు అనుకున్నారు. చివరకు మూడు పూర్తయ్యాయి. మొదటి ప్రాకారానికి నాలుగు వైపులా నాలుగు గోపురాలనుకున్నారు. అన్నీ సగం సగం పూర్తయ్యాయి. రాజగోపురం మూడంతస్తులయింది. ఎన్నో శిల్పాలు



పూర్తయ్యాయి. ఎన్నో కావలసినవి ఉన్నాయి. ఉన్నట్టుండి ఆలయ నిర్మాణం ఆగిపోయింది.

కృష్ణదేవరాయలు ఏకైకపుత్రుడు తిరుమలరాయలు. బాల్యంలోనే చనిపోయాడు. వాడిమీద పెట్టుకొన్న ఆశలు గల్లంతుకావడంతో ఆయనకు పరిపాలనమీదనే ఆసక్తి సన్నగిల్లింది. రాజ్యమే వద్దనుకున్నాడు. అప్పటికి చంద్రగిరిలో ఉన్న అచ్యుతదేవరాయలను ఆహ్వానించి రాజ్యపాలన స్వీకరించమన్నాడు. ఈ పరిస్థితులలో నాగలాపుర ఆలయ నిర్మాణం ఆగిపోయిందని రైతులు తీసికొన్న అప్పులు అతీగతీ లేదని హరిదాసు పంపిన వార్తవిని ఆయన మిన్నకుండిపోయారు. చేతిలో ఏదైనా పైకం మిగిలివుంటే అది తిరుమల శ్రీవారి హుండీలో వేసి చేతులు దులుపుకోమని లేఖ పంపినాడు- హరిదాసుకు. సర్వశక్తిమంతుడైన సార్వభౌముడు అలా ఆదేశించేసరికి అదిరిపోయిన హరిదాసు ఎక్కడి విగ్రహాలు అక్కడక్కడే సర్దివేసినాడు.

తొలిద్వారంలో ద్వారపాలకులు ఒకవైపు విఘ్నేశ్వరుడు, మరొకవైపు విష్ణుదుర్గ, రెండవ ద్వారంలో ఒకే ఒక ద్వారపాలకుడు. మూడవద్వారంలో ఇద్దరు ద్వార పాలకులున్నారు. చివరి ద్వారంలో ఒక ద్వారపాలకుడు మణి. ఇంకోవైపు ద్వారపాలిక సంధ్య. ఇలా ఎందుకంటే గర్భాలయంలో అయ్యవారు అమ్మవార్లు కలసివున్నందువల్ల - ద్వారపాలకులను ఆడ మగ కలిసి పెట్టారనుకోవాలి. రెండో ప్రాకారంలోని వసారామండపాలయాలలో సీతారామచంద్రులు, లక్ష్మీ నరసింహస్వామి, వీరాంజనేయస్వామి ఉన్నారు. ఈశాన్యంలో మరో భక్త ఆంజనేయస్వామి ఉన్నారు.ఇక్కడ నేలమాళిగలో దాదాపు పదేళ్ల క్రితం పంచలోహవిగ్రహాలు కొన్ని దొరికాయి.ఇవన్నీ అందమైనవి. అపురూప మైనవి. పన్నిద్దరు ఆళ్వార్లు లక్ష్మీనారాయణ, విష్వక్సేన, కొన్ని దీపస్తంభాలు, దొరికిన వాటిలో ఉన్నాయి.

కరియమానిక్కప్పెరుమాళ్‌కు చేసిన దానాలు, హరిగండాపురం సంపూర్ణాదాయం, రైతులకిచ్చిన రుణాలు, కొన్నిలక్షల పైకం ఇలా ఎంతో ఖర్చయినా ఆలయం పూర్తికాకపోవడం చాలా విషాదకరం. వేదనారాయణుడు రాయలకు స్వప్నాదేశాలు ఇచ్చాడంటారు అయినా ఏమయింది? ఆ విజయనగర శిల్పులు శ్లాఘనీయులు. వారు చెక్కిన శిల్పాలు అపురూపాలు. శాశ్వతాలు. వేణుగోపాలస్వామి, వీణాదక్షిణామూర్తి, లక్ష్మీనారాయణస్వామి, త్రిమూర్తి (ఈ విగ్రహం సప్తస్వరాలు వినిపిస్తుంది), భూవరాహమూర్తి, హయగ్రీవ, త్రివిక్రమ ఇలా ఎన్నో.... ఏ శిలైనా వారిచేతిలో మైనం ముద్దలాగ కరిగిపోయి కోరిన రూపం దాల్చినట్టుంది. ఆలయం పూర్తియివుంటే ఈ విగ్రహాలు సముచితస్థానంలో ప్రతిష్ఠించబడి ఉంటే ఆ ఆలయశిల్పకళాశోభ జగద్విదితమై ఉండేది. ఆ ఆలయమే భూలోక వైకుంఠమై ఒప్పి ఉండేది. అలా జరుగలేదు. మనకా అదృష్టం లేదు. కొన్ని శిల్పాలు అక్కడే ఉన్నాయి. మరికొన్ని తిరుమలలోని తి.తి.దే. వస్తుప్రదర్శనశాల చేరాయి. తిరుపతి మ్యూజియంలో కూడా ఒకటి రెండున్నట్టున్నాయి. 27-04-1967 నుంచి ఈ ఆలయం తి.తి.దే. వారిది కాబట్టి.

కృష్ణరాయలే అలా శాసించినప్పుడు హరిదాసు మాత్రం ఏంచేస్తాడు? కరియమాణిక్య పెరుమాళ్ విగ్రహ మొక్కటే భిన్నమైంది. ఆయనకు ఇరువైపులా రుక్మిణీ సత్యభామలు సలక్షణంగా ఉన్నారు. నూతన విగ్రహం తయారుకాలేదు గాబట్టి అప్పటికప్పుడు నవనీత విగ్రహం తయారు చేయించి ప్రతిష్ఠించాడు హరిదాసు. శంఖుచక్రాలున్నాయి. కానీ చక్రం మాత్రం ప్రయోగచక్రం. సోమకాసరుని అప్పుడే చంపినట్టు.

పూజాసమయమున పొరబాటున నీళ్లుపడి స్వామి పాదాలు తుడుచుకపోయాయి. ఆయన తనంతట తానుగా కాళ్లు పోగొట్టుకొని మత్స్యావతారుడైపోయాడు. అంటే చేపకు కాళ్లు ఉండవుగదా. రుక్మిణి



సత్యభామలు శ్రీదేవి, భూదేవిగా మారిపోయారు. మరి వేదనారాయణుడికి వేదవల్లితాయారు గావాలి గదా! అందుకని ప్రత్యేకంగా అప్పటికప్పుడు ఆలయ ఆవరణలోనే నైఋతిదిక్కున ఒక చిన్న ఆలయాన్ని నిర్మించి ఆమె విగ్రహం సిద్ధమైవున్నందున వేదవల్లీ తాయారును ప్రతిష్ఠించారు. అంతటితో వదిలిపెట్టాడు హరిదాసు. తరువాతది తి.తి.దే. వారిపని.

స్వామి నవనీత విగ్రహుడు కాన ఆయనకు తైలాభిషేకం మాత్రం తిరుపతి గోవిందరాజస్వామికి చేసినట్టు చేస్తారు. అంటే మంచినూనె పూయడం. పాదాలు లేవు గాన బంగారు పాదాలు చేసిపెట్టారు – దేవస్థానం వారు ఈ శిథిలాలయాన్ని స్వీకరించి జీర్ణోద్ధరణ చేసినప్పుడు. రాజగోపురం మూడంతస్తులు నెత్తిన పడేటట్టుంటే తొలగించి దానిమీద శ్రీదేవి భూదేవి సహిత వేదనారాయణస్వామి విగ్రహాలు కట్టారు. అలాగే అన్నివైపుల గోపురాలను వీలైనంతవరకు జీర్ణోద్ధరణ చేసి ఆలయాన్ని బాగు చేశారు. ఉత్సవ విగ్రహాలు మాత్రం శ్రీకృష్ణుడు రుక్మిణి సత్యభామలుగానే ఉన్నా వాటినే శ్రీదేవి భూదేవి సహిత వేదనారాయణస్వామిగానే చూస్తున్నారు. ప్రాకారాలమీద శిలాశాసనాలు కాపీరైటు పుస్తకంలో లాగా ఉంటాయి. వీటిని గురించి రాయాలంటే అదొక గ్రంథమౌతుంది.

ఆలయం పశ్చిమాభిముఖం. ఎదురుగా గరుడాళ్వారు కానీ ఆంజనేయస్వామిగానీ ఉండరు. అందువల్ల సూర్యనారాయణస్వామి సంవత్సరములో 5 రోజులు మార్చి 24 నుంచి 28వ తారీఖువరకు సూర్యసేవ చేసికొంటారు. సాయంకాలం నాలుగైదు గంటలకు జరిగే ఈ సూర్యసేవకు ధ్వజస్తంభం, బలిపీఠం అడ్డురావు. సూర్యకిరణాలు తొలి రెండు రోజులు పాదాలను, తరువాత నాభిని, చివరి రెండురోజులు ముఖారవిందాన్ని తాకి లేదా స్పృశించి సేవచేయడాన్ని చూడటానికి జనం విశేష సంఖ్యలో హాజరవుతారు. ఈ సూర్యసేవకు తెప్పోత్సవాలు కూడ జరుగుతాయి. తొలిరోజు శ్రీ సీతాసమేత శ్రీరామచంద్రస్వామికి, రెండవరోజు

నుంచి 5వ రోజుదాకా శ్రీ వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణస్వామికి జరుగుతాయి. 9 రోజులు బ్రహ్మోత్సవాలు తిరుమలబ్రహ్మోత్సవాల క్రమంలోనే జరుగుతాయి. కానీ ఇక్కడ స్వర్ణ రథోత్సవం ఉండదు. ఇక్కడ మత్స్యజయంతి కూడ ఘనంగా జరుపుతారు.

చోళరాజుల అంత్యదశలో యాదవరాజులు స్వతంత్రులై ప్రస్తుత నెల్లూరు, చిత్తూరు జిల్లాలలోని భూభాగాలు ఏలినారు. తిరుపతి గోవింద రాజాలయంలోని పార్థసారథి ఆండాలమ్మ ఆలయం, తిరుచానూరు పద్మావతమ్మ ఆలయంలోని బలరామకృష్ణులు, కార్వేటినగరంలోని (నిశ్శంకు) వేణుగోపాలస్వామి, నాగలాపురంలోని యాదవనారాయణస్వామిగుడి, నగరిలోని కరియమాణిక్య పెరుమాళ్ మొదలగు కృష్ణాలయాలు నిర్మించి తమ కులదీపకుడైన శ్రీకృష్ణుని సేవ చేసినారు. తిరుక్కాలత్తి దేవయాదవ రాయర్ తిరుచానూరును శ్రీవారికి దానం చేయగా ఆయన మనుమడు తిరువేంకటనాథయాదవరాయడు తిరుపతి పట్టణాన్ని దానం చేశాడు. వారి ఆలయాలలో నాగలాపురం యాదవనారాయణుడు ఒక్కడు మాత్రం వేదనారాయణుడైనాడు.

కరికాలచోళుని కుమారుడు నెడుమూడి కిళ్లి నాగలాపురంలోని ఒక నాగరాణిని ప్రేమించి పెళ్ళిచేసుకోలేక ఉంపుడుకత్తెగా ఉంచుకొన్నాడు. వారి కుమారుడే తొండమాన్ ఇళయాన్ తిరయ్యాన్. పురాణాలలోని తొండమాన్ చక్రవర్తి. ఇది చరిత్ర.

**సురుటుపల్లి:** ఆంధ్ర తమిళనాడు సరిహద్దులో నాగలాపురంకు సమీపంలో మద్రాసుకు పోవుదారిలోనే సురుటుపల్లి ఉంది. సముద్ర మథన సమయంలో పుట్టిన హాలాహలాన్ని శివుడు మ్రింగి కడుపులోకి పోతే లోకాలన్నీ నాశనమవుతాయని గొంతులోనే దాచుకొన్నాడు. దాంతో స్పృహ కోల్పోయాడు. పార్వతమ్మ ఒడిలో పెట్టుకొని సేదతీర్చింది. సురులంతా ఆయన్ను చూడడానికి విచ్చేశారు. దాంతో ఆ వూరు సురులపల్లిగా పిలువబడి



చివరకు సురుటుపల్లి అయింది. స్వామి కంఠం విషప్రభావంతో నల్లగా మారింది. దాంతో ఆయన నీలకంఠుడుగా మారినాడు. పల్లికొండేశ్వర స్వామిగా, శయనశివుడుగా కూడ ఆయన్ను పిలుస్తారు.

శివలింగంగా కాకుండా విగ్రహరూపంలో పరమశివుడు ఇక్కడ తప్పితే ఎక్కడా కనపడడు. పైగా పద్మనాభస్వామిలాగా అమ్మ ఒడిలో పవళించి ఉంటాడు. ఆయన బాధతో కళ్లుమూసికొని ఉంటాడు, అమ్మముఖం ఆందోళనలో ఉన్నట్టు కనిపిస్తుంది. పేరు 'సర్వమంగళ' కానీ అలా కనపడదు. దక్షిణాదిలో రాతితో నిర్మించు ఆలయాలు క్రీ.శ. 7 శతాబ్దనుంచే వెలశాయి. అంతకుమునుపు ఆలయాలు కలప, సున్నం, ఇటుకలతో నిర్మించేవారు. ఇది కూడా అలాంటిదే. అంటే అంతప్రాచీనమైన దేవాలయం. పైగా స్వామి విగ్రహం శిలకాదు. మట్టితోచేసి రంగులు పూశారట. అంటే శిలా విగ్రహాలు అమలులోకి రాని కాలంనాటి వాడన్నమాట. శాసనాధారం లేదు కాబట్టి కాల నిర్ణయం చేయలేము. మట్టి విగ్రహమైనా శతాబ్దాల కొద్దీ చెక్కు చెదరకుండా ఉంది.

ఈ ఆలయ ఆవరణలో మూడుగుళ్లున్నాయి. రాజగోపురాని కెదురుగా మరకతవల్లి ఆలయముంది. ఆమె వల్మీకేశ్వరస్వామి ప్రక్కన ఉంది. ముఖ మండపం స్తంభాలపైన వివిధ రకాల శిల్పాలున్నాయి. దక్షిణదిక్కులో అప్పర్, సంబంధర్, సుందర్ (నయన్మార్లు) వాల్మీకి, పరాశరేశ్వర్, జ్యేష్ఠాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఇవన్నీ చోళ చక్రవర్తుల కాలంనాటివని తెలుస్తోంది. రంగులతో వేసిన కుడ్యచిత్రాలు విష్ణువు, బ్రహ్మ, దిక్పాలక, కాలభైరవ కొందరు మహర్షులు నీలకంఠుని ప్రక్కనున్నారు.

మొత్తానికి సురుటుపల్లి పల్లికొండేశ్వరుడు గుడిమల్లం పరశురామేశ్వరస్వామి, శ్రీకాళహస్తీశ్వరస్వామివారిలాగ ప్రాచీనుడని తెలిస్తోంది.

* * * * *

# 7. తరిగొండ-శ్రీ లక్ష్మీనరసింహస్వామి

పెరుగుకుండ, మంథాద్రి. తరికుండలో కనపడినవాడు తరిగొండ సాలగ్రామ నృసింహుడు. ఒక కథ ప్రకారం – రాయదుర్గంలో కరువురాగా పశువుల మేతకోసం వాటిని తోలుకొని వలసవచ్చిన రామానాయనింవారు అనే పాళేగారుకు ప్రత్తిమిట్ట పాలనూయి మడుగు వద్ద స్వప్నంలో కనబడి తనకు ఆలయం నిర్మించమని శ్రీలక్ష్మీనరసింహస్వామి కోరి ఆలయం కట్టించుకున్నాడు. అంతకుమునుపే లక్ష్మీనరసమ్మ మజ్జిగ చిలుకుతూండగా ఆ కుండలో లక్ష్మీనరసింహుడు సాలగ్రామంగా దొరికి ఆలయంలోనే ప్రతిష్ఠించమన్నాడట. ఇంకొక కథ లక్కమాంబ అనే గొల్లయువతి కదిరి లక్ష్మీనరసింహస్వామి భక్తురాలు. లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లకు పోయి రావాలని అత్తగారింట్లో అనుమతి అడుగగా వాళ్లు రోజూలాగే తరిగొండకు పోయి పాలుపెరుగు అమ్ముకు రమ్మని ఆదేశించారు. ఆమె తరిగొండకు పోతూవుంటే గంప బరువెక్కిపోయింది. దించి చూడగా పాలముంతలో నల్లటి రాతిప్రతిమ కనిపించింది. షరామామూలే. స్వామి స్వప్న ఆదేశం మేరకు గ్రామ పెద్దలు లక్ష్మీనృసింహస్వామి ఆలయం నిర్మించి విగ్రహాన్ని భూమినుంచి త్రవ్వితీసి అందులో పాలముంత స్వామితో బాటు ప్రతిష్ఠించారు. అలా తరిగొండలో వెలసినాడు లక్ష్మీనృసింహుడు.

వాయల్పాడు (వాల్మీకిపురం) నుంచి గుర్రంకొండకు పోవు రహదారిలో ఐదారు కి.మీ.లలో తరిగొండ ఉంది. ఈ గ్రామంలో తరిగొండ వేంగమాంబ జన్మించి ఊరిపేరు వ్యాప్తిలోకి తెచ్చింది. ఈ ఆలయంలో మూడు శాసనాలున్నాయి. మొదటిది క్రీ.శ.1559, విజయనగర చక్రవర్తి సదాశివదేవ మహారాయలవారిది. రాజుగారి అనుమతి, మహామండలేశ్వర రామరాజదేవ మహారాయ అంగీకారంతో జిల్లెల వెంగళరాజదేవ మహారాజ మంగళివారి పన్నుతగ్గించడను గూర్చి ఉంది. అంటే ఆలయం క్రీ.శ.1559 నాటికే ఉంది. రెండవ శాసనం క్రీ.శ.1846 సంవత్సరలో హోమశాలను,



వంటశాల మండపాన్ని గురుభాస్కరాచార్య శిష్యుడైన ఎఱ్ఱప్ప నిర్మించాడు. మూడవశాసనం క్రీ.శ.1862 నాటిది. లక్ష్మీనృసింహస్వామికి కృష్ణమశెట్టి కల్యాణమండపాన్ని నిర్మించాడు. ఇవివున్నా ఆలయ నిర్మాత పేరులేదు. మొత్తానికి ఆలయం 16వ శతాబ్దములో నిర్మించబడినదిగా భావించ వచ్చును. ఆలయనిర్మాత, తదుపరిగ్రామ నిర్మాత రాయదుర్గం రామానాయనింవారు అనుట నిర్వివాదాంశం. తరువాత ఆయన ఇంటి పేరు తరిగొండగా మారినట్టు ఒక కౌలుపత్రముద్వారా తెలుస్తోంది. తదనంతరకాలంలో వారు భాకరాపేట సమీపం చిట్టేచెర్లకు వలస పోయినందువల్ల చిట్టేచెర్ల పాళేగార్లుగా నిలిచి ఉన్నారు.

ఎక్కడి రాయదుర్గం. ఎక్కడి తరిగొండ. పశు సంరక్షణకై వలసవచ్చి ఇక్కడ స్థిరపడడం. రామానాయనిం భార్య లక్ష్మీనరసమ్మ పెరుగు చిలుకుతున్నప్పుడు అందులో సాలగ్రామము తగలడం, యజమానికి స్వప్నంలో నరసింహస్వామి కనపడి తన విగ్రహాన్ని భూమిలోంచి త్రవ్వితీసి ఆలయంకట్టి ప్రతిష్ఠించమనడం, నిర్మాణ సమయంలో ధనరాసులు దొరకడం, ఆలయం సలక్షణంగా దిగుడుబావితో సహా పూర్తికావడం అందులో లక్ష్మినరసింహస్వామి, ఆయన ప్రక్కన సాలగ్రామం ప్రతిష్ఠించబడడం, తరిగొండ పేరుతో గ్రామం ఏర్పడడం, స్వామికూడా తరిగొండ లక్ష్మీనరసింహస్వామిగా చెలామణి కావడం ఇవన్నీ దైవలీలలు.

మరొక దైవలీల ఈ గ్రామంలో విదుషీమణి తరిగొండ వేంగమాంబ జన్మించడం. లక్ష్మీనరసింహుని దయతో ఆమె అంతటి స్థాయి గడించిందో లేక ఆమె ఖ్యాతితో లక్ష్మినరసింహుడు అంత ప్రసిద్ధుడయ్యాడో చెప్పలేం. రెండూ సాధ్యమే. కానాలవారు కర్నూలు జిల్లానుంచి ఇక్కడికొచ్చి స్థిరపడినారు. వారిలో కానాలకృష్ణయ్య మంగమ్మ దంపతులకు ఈమె అపర మీరాబాయిలాగ జన్మించింది. ఈమెతో బాటు భక్తి పుట్టింది. ఆ ధ్యాసలో

ఉండిపోయింది. పెళ్లిచేస్తే పీడ వదలిపోతుందని చిత్తూరు సమీపంలోని నారగుంటపాళెం నుంచి ఒక ఇంజేటి వెంకటాచలపతిని తెచ్చి పెళ్ళిచేశారు. అప్పటికే ఆమె మనసు తిరుమల వేంకటాచలపతిమీద ఉంది. ఆ సంగతి ఈ వేంకటాచలపతికి చెప్పింది. విధివశాత్తు వెంకటాచలపతి మరణించినా, నాభర్త తిరుమలేశుడే అంటూ ముత్తైదువచిహ్నాలను తీసివేయకుండా వెంగమాంబ తిరుగసాగింది. ఊర్లోవాళ్లకి ఒళ్లు మండింది. ఇలా కాదనుకొని ఆదారిన పోతున్న పుష్పగిరి పీఠాధిపతిని పట్టుకొచ్చారు. ఆయనను పక్కకు తొలగుమని పీఠానికి నమస్కరించింది. అది కాలిపోయింది. దాంతో ఆయన కాలిపోయిన పీఠాన్ని కడసారి చూసుకొని బతుకు జీవుడా అనుకొంటూ వెళ్లిపోయాడు.

మదనపల్లిలో రూపావతారం సుబ్రహ్మణ్యగురుని శరణుజొచ్చి తనకూతురు బ్రతుకు బాగుచేయమన్నాడు కానాలకృష్ణయ్య. ఆయన దయాళువై వేంగమాంబకు మంత్ర, తంత్ర, యంత్ర రహస్యాలను యోగ సూత్రాలను బోధించి ఇవి పునాదులు మాత్రమే భవంతులు నీవే నిర్మించుకొమ్మని సలహా ఇచ్చినాడు. హయగ్రీయ నృసింహమంత్రాలు ఆమెకు దిశానిర్దేశం చేశాయి. ఆమె కావ్యరచనకు ఉపక్రమించింది. మధ్యలో యోగసాధన. తరిగొండ నృసింహాలయంలో ఉన్న ఆంజనేయ స్వామి వెనుక భాగంలో ఖాళీస్థలం ఆమె సాధనలకు అనుకూలంగా ఉండేది. ఒకరోజు అర్చకుడు అనూహ్యంగా ఆమెను చూసి జడుసుకొని ఆ బిత్తరతో ఆమె జుట్టులాగాడు. అంతే ఆమెకు తరిగొండకు రుణం తీరిపోయింది. ఆ ఊరు వదలిపెట్టేసింది. వేంకటాచలపతిని వెదుక్కుంటూ అడవిమార్గం పట్టింది. దారిలో మొగిలిపెంట ఆంజనేయస్వామి దగ్గర కొన్ని సాధనలు చేసి తిరుమల శ్రీవారి ఆజ్ఞతో వేంకటాద్రి చేరింది. ఆలయ నాలుగు మాడ వీధులు కలయదిరిగింది. ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. హథీరాంజీ మఠానికి చెందిన ఆత్మారాంజీ మహంత్ ఆమెను గురించి తెలిసికొని



వరాహస్వామి ఆలయం ఎదురుగా రాతితేరు ప్రక్కన ఒక పూరిగుడిసె ఆమె నివాసానికి ఇచ్చాడు. అందులో ఎక్కువకాలం ఆమె నివశించలేదు.

కీకారణ్యంలోని తుంబురుతీర్థం వెళ్లిపోయింది. అక్కడొక గెవి (ఇప్పుడామె పేరుతోనే తరిగొండ వేంగమాంబగెవి) లో పుష్కరకాలం తపస్సు చేసి మహాయోగినిగా దివ్యశక్తులతో తిరిగి తిరుమల చేరింది. తాళ్లపాక వారు ఆమె దివ్యత్వాన్ని గ్రహించి తమ ఇంటి ప్రక్కనే చోటిచ్చారు. తరిగొండ వేంగమాంబ మఠం ఏర్పడింది. అన్నదాన సత్రం కూడా వెలసింది. వాటికి భూదానాలు, ధనధాన్యాదులు, దానాలు వచ్చాయి. వరాహస్వామి గుడి ప్రక్కన ఆమె కొక పూదోట ఉండేది. ఇప్పుడామె సమాధి అక్కడే ఉంది. అదిగాక అమ్మోరుబావి (పాపవినాశం కాలిదారి పక్కన) దగ్గర కూడా ఒక ఫలపుష్పవనం ఉండేది. ఆమెకు వచ్చిన దానాలు దాదాపు 35. వాటితో నిత్యపూజలు. నృసింహజయంతి ఘనంగా జరిపేది. కవితలతో, పద్య పాటలతో, నాటకాలతో, ముఖ్యంగా యక్షగానాలతో స్వామిని రంజింప చేయటమేగాక నాజూకు పూలమాలలు, ఆత్మీయ పూజాపునస్కారాలు, పంచభక్ష పరమాన్నాలతో స్వామిని మురిపించేది. అందుకే ఆమెకు స్వామి ఏకాంతసేవలో ముత్యాలహారతి ఇచ్చే భాగ్యం శాశ్వతంగా దక్కింది. ఇప్పుడామె వంశీకులు దానిని అనుభవిస్తున్నారు.

అష్టఘంటకలని ఆమె రచనలను వ్రాసిపెట్టే పాళేగార్ల వ్రాయసగాళ్లు ఎనిమిది మంది ఎప్పుడూ ఆమెను ఆవరించి ఉండేవారు. ఆమె రచనలన్నీ వారు తాళపత్రాల కెక్కించి దేశమంతా వ్యాపింపజేసినారు కానీ ఆమె స్వంతానికి ఒక్కటి గూడ లేకుండా చేసినారు. మొత్తం ఆమె రచనలు 18పైగా ఉన్నాయి. ప్రతిరచనలోనూ తరిగొండ లక్ష్మీనృసింహుడు, తిరుమల వేంకటాచలపతి అభేదంగా ఒక్కటిగా కనిపిస్తారు. అదే విధంగా ఆమె ఇంజేటి వేంకటాచలపతిని, తిరుమల వేంకటాచలపతిని అభేదంగానే గౌరవించింది. ఆమె మహిమలను రచనలనుగూర్చి ఎంతరాసినా తక్కువే.

తరిగొండకు చెందిన ఒక వైశ్యప్రముఖుడు 1940 ప్రాంతంలో ఆమె విగ్రహాన్ని తయారు చేయించి లక్ష్మీనృసింహాలయంలో ప్రతిష్ఠించి పునీతుడయ్యాడు. అక్కడ ఆమెకు రోజూ పూజలు జరుగుతాయి. తిరుమలలోని ఆమె సజీవసమాధికి అక్కడి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయినులు శుక్రవారపూజలు చేస్తారు. తి.తి.దే. వారు నృసింహజయంతికి ఆమెజయంతిని, శ్రావణశుద్ధనవమికి ఆమె వర్ధంతిని రెండుచోట్లా జరుపుతున్నారు. దానికని వెలసినదే మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు. ఉత్సవాలు జరుపడమే కాకుండా ఆమె వాఙ్మయం కూడా పుస్తకాలరూపంగా, సి.డిలు క్యాసెట్ల రూపంగా ప్రచారం చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆమె జననం సుమారు క్రీ.శ.1730, మహాసమాధి క్రీ.శ. 1817.

చుట్టూ ఎత్తయిన ప్రాకారంతో మూడంతస్తుల రాజగోపురంతో విలసిల్లే శ్రీ లక్ష్మీనృసింహాలయంలో 9 రోజుల బ్రహ్మోత్సవం వైభవంగా జరుగుతుంది.

సత్యప్రమాణాలకు పేరొందిన దీ క్షేత్రం. ఈ ఆలయంలోని బలిపీఠం ముందు నిలబడి ఎవరైనా సత్యప్రమాణం చేస్తే దానిని కోర్టులతో సహా అందరూ అంగీకరించవలసినదే. అంతటి విశ్వాసం ఉన్నది సత్యదేవుడైన ఈ లక్ష్మీనృసింహుని మీద.

* * * * *

## 8. వాయల్పాడు (వాల్మీకిపురం)– శ్రీ పట్టాభిరామస్వామి

తిరుపతి నుంచి దాదాపు 100 కి.మీ. దూరంలో వాయల్పాడు వుంది. అటు నుంచి పోతే మదనపల్లి కూడ దగ్గరే. అంటే ఇది ఒక కూడలి కేంద్రం మాత్రమేగాక ఒకప్పుడు కడపజిల్లాతో కలిసిన తాలూకా కేంద్రం. ఇప్పుడు మండల కేంద్రం.

బోయవాళ్లు ఎక్కువగా ఉండే కాలంలో బోయలపాడై తర్వాత వాయల్పాడైందట. వావిలి చెట్లు ఎక్కువగా ఉన్నందువల్ల 'వావిల్‌పాడు' గా పిలువబడి అదే వాయల్‌పాడ్ అన్నారని ఒక ఐతిహ్యం. వాల్మీకి మహర్షి ఇక్కడ తపస్సు చేశాడని వల్మీకం (పుట్ట) నుంచి సీతారామలక్ష్మణభరతశతృఘ్న విగ్రహాలను సాధించాడని వారిని జాంబవంతుడు ప్రతిష్ఠించాడని ఉభయతారకమైన ఈ కథను అందరూ అంగీకరించారు. తి.తి.దేవస్థానం వారు కూడా అంగీకరించి ఈ ఆలయాన్ని 1997లో తమ ఏలుబడిలోకి తీసికొన్నారు. ఒకప్పుడు కడపజిల్లా కలెక్టరుగా ఉన్న ఆంగ్లేయుడు హార్డింగ్స్ కడుపు నొప్పికి మొక్కుకొని ఆలయం ముందు కట్టించిన అందమైన నాలుగ్గాళ్ల మండపంలో వాల్మీకిమహర్షి విగ్రహాన్ని 6-4-2006లో ప్రతిష్ఠించారు.

మహానాయంకరాచార్య కంబం తిమ్మనాయుని వెంకటాద్రి నాయనింగారు కందనవోలు సీమలోని వావిలిపాడు భూములు ఈ రఘునాథ ఆలయానికి మాన్యంగా ఇచ్చినట్టు క్రీ.శ. 1534 సంవత్సరంలో అచ్యుత దేవ మహారాయలు దానిని అంగీకరించినట్టు శాసనం ఉంది. ఇక్కడికి సమీపంలో తిరుపతి దారికి ఆనుకొని విఠలం గ్రామం ఉంది. ఇక్కడ విఠలేశ్వర ఆలయం ఉండడం వల్ల గ్రామానికి కూడ ఆ పేరు వచ్చింది. ఆ ఆలయాన్ని అచ్యుతదేవమహారాయల కాలంలో (క్రీ.శ.1535) వెంకటాద్రి నాయకుడు నిర్మించి, భూములను మాన్యంగా ఇచ్చాడు. ఈయన పైన

చెప్పబడిన కంబం తిమ్మనాయకుని కుమారుడు. ఇక్కడ ఇదివరకే సాళువ నరసింహరాయల శాసనమొకటి దొరికింది. ఈ తాలూకాలోని దేవులపల్లిలో దొరికిన శాసనం చరిత్రకారుల పాలిటి కల్పవృక్షం. సాళువరాజుల వంశవృక్షం అందులో ఉంది. క్రీ.శ. 1505లో సాళువనరసింహరాయల కొడుకు ఇమ్మడి నరసింహుడు విజయనగర చక్రవర్తిగా ఉన్నప్పుడు మర్జవాడ సీమ (పెనుగొండ మహారాజ్యంలోనిది) లోని దేవులపల్లిని మాచన బట్టు అనువానికి దానంగా ఇస్తూ ఈ శాసనం వేయించాడు.

"చంద్రవంశంలో గుండ అనేవాడు పుట్టాడు. ఆయనకు ఆరుమంది కొడుకులు. వారిపేర్లు గుండ, బొమ్మ, మాదిరాజ, గంటయ, వీరహోబల, సావిత్రి, మంగి సాళువమంగి (సావిత్రి మంగి కూతుర్లేమో? ఇద్దరెక్కువగా ఉన్నారు). సాళువమంగి ఒక సైనికునినుండి కఠారి పుచ్చుకొన్నాడు. గౌత అను కొడుకును కన్నాడు. ఈతని కొడుకు గుండ. ఈయన మల్లాంబికను పెళ్లిచేసికొన్నాడు. వీరికి అహోబల నరసింహస్వామి దయవల్ల నరసింహరాయలు జన్మించాడు. ఈయనకు మీసరగండ, కఠారిసాళువ, ధరణీవరాహ, పంటఘ్నుంట నినాద, ఐవరగండ మొదలగు బిరుదులు. ఈయన చేర, చోళ, పాండ్యరాజులను ఓడించి మూరురాయరగండ బిరుదు వహించాడు. శ్రీరంగాంబాదేవిని వివాహమాడినాడు. వారికి ఇమ్మడి నరసింహుడను ఈ దాత పుట్టాడు........" దీని తరువాత దాన గ్రహీత మాచనబట్టు వంశవృక్షముంది. అది అనవసరమని వదలివేస్తున్నాను. సాళువనరసింహరాయలు తిరుమల శ్రీవారి కెంతో సేవచేశాడు గాబట్టి ఆతని వంశవృక్షం భావితరాలవారికి ఇవ్వడం జరిగింది.

ఈ పట్టాభిరామస్వామి ఆలయంలో ఒక శాసనం క్రీ.శ. 1833 నాటిది ఉండేది. ఇప్పుడుందో లేదో తెలియదు. ఈ ఆలయానికి పోలేపల్లి వెంకట్రామయ్యశెట్టిగారు (శా.శ. వర్షంబులు 1755 విజయ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమినాడు.) ఒక ధర్మశాల కట్టించారు.



ఈ పోలేపల్లి వేంకట్రామయ్యశెట్టిగారు మంచిదాతృత్వం కలిగి వాయల్పాడుకు ఎంతో సేవచేశాడు. 1895లో వాయల్పాడులో ఒక ప్రాథమికోన్నత పాఠశాల ప్రారంభించినాడు. దానిని 1914లో థియోసాఫికల్ ట్రస్టుకు అప్పగించినాడు. 1915లో దానిని చిత్తూరు జిల్లాబోర్డు స్వీకరించి మాధ్యమిక పాఠశాలగా మార్చినారు. దానికి పి.వి.సి. మిడిల్‌స్కూల్ అని మద్రాసు ప్రభుత్వఅనుమతి తీసికొని పేరుపెట్టినారు. ఆ పేరు ఇప్పటికీ ఉంది అది కాలేజీగా మారినాకకూడ. ఆయన సేవలకు 1-1-1903లో 7వ ఎడ్వర్డ్ చక్రవర్తి 12-12-1911లో 5వ జార్జిచక్రవర్తి గుర్తింపు పత్రాలు ఇచ్చారు. రెండవది ఢిల్లీ దర్బారు కోరోనేషన్‌లో ఇచ్చారు. 24-8-1937లో ఆయన చిత్రపటాన్ని పాఠశాలలో ఆవిష్కరించారు. ఎందరో మహానుభావులు అందరి బాగుకు పనిచేస్తారు.

ఇక పట్టాభిరామస్వామి ఆలయానికొస్తే ఆలయం గ్రామ మధ్యలో ఉంది. చుట్టూ నూరు కుప్పల కొండలున్నాయి. వాటిని శతశృంగ పర్వతాలని అక్కడే వాల్మీకిమహర్షి ఆలయముండేదని అంటారు. బాహుదానది ఊరిని చుట్టుకొని ప్రవహిస్తుంది. ఈ ప్రాంతాన్ని పల్లవ, చోళ, బాణ, వైదుంబ, హొయసల, విజయనగర చక్రవర్తులు పాలించారు. వారి తరువాత కడప, గుర్రంకొండ, మైసూరు నవాబులు ఏలినారు.

ఆలయంలో మూలమూర్తులంతా కొలువై ఆంజనేయస్వామికి చోటు లేక బయట ఉన్నాడు. సీతమ్మవారు స్వామికి కుడివైపున ఉన్నారు. నాలుగంతస్తుల రాజగోపురం ఉంది. గర్భాలయంమీద కలశానికి బదులు సుదర్శన చక్రం వుంది. ఊంజలిమండపాలు మూడున్నాయి. ఎత్తయిన ప్రాకారంతో చూడదగిన పుణ్యక్షేత్రం. స్వామికి 9 రోజులు బ్రహ్మోత్సవం 3 రోజుల పట్టాభిషేక మహోత్సవం, 4రోజుల పవిత్రోత్సవం ఏటేటా జరుగుతాయి.

* * * * *

# 9. తొండవాడ – శ్రీ అగస్త్యేశ్వరస్వామి

కైలాసంలో శివపార్వతుల కల్యాణం జరుగుతోంది. దేవతలంతా అక్కడ గుమికూడారు. వారి బరువుతో భూమి అటువైపు ఒరిగిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన శివుడు అగస్త్యమహాముని పిలిచి దక్షిణాదికి పోయి భూమిని సమమట్టం చేయమన్నాడు. అందరూ ఒక ఎత్తు – అగస్త్యుడు ఒక ఎత్తుగదా! అందుకని స్వామి కల్యాణం చూడకుండా పోవలసి వచ్చిందేనని అగస్త్యునిమనసులో వెలితి ఏర్పడింది. ఆ సంగతి గ్రహించిన శివుడు, కల్యాణం నీకు అక్కడికే కనిపిస్తుంది పో ! అని చెప్పడంతో అగస్త్యుడు వెంటనే దక్షిణాదికి బయలుదేరాడు.

దారిలో వింధ్యపర్వతం అడ్డువచ్చింది. అప్పటికే అది సూర్యచంద్ర గమనాలకు అడ్డు వస్తోందని ప్రతీతి. తాను దక్షిణాదికి పోయివస్తానని అంతవరకు అణిగి ఉండుమని అగస్త్యుడు ఆదేశించగా అది అణిగిమణిగి దారి ఇచ్చింది. దాటివచ్చిన అగస్త్యుడు తిరిగి ఉత్తరాదికి పోలేదు. వింధ్యపర్వతం అలాగే ఉండిపోవడంతో దానికి గర్వభంగమైంది. దక్షిణాదికి వచ్చిన అగస్త్యుడు పూర్వాద్రి, సహ్యాద్రి పర్వతాలు కలిసేచోటునుంచి శివ కల్యాణం కాంచినాడు. ఆనందతరంగాలలో తేలియాడుతూ మొత్తం కొండలన్నీ కలియదిరగడంతో అన్నీ అగస్త్య పర్వతాలని పేరుపడ్డాయి. మల్లేపల్లి కొండలలో తిరుగుతున్నప్పుడు స్నానపానాదులకు నీటిసౌకర్యం లేకుండడం చూసి ఆదినేపల్లి దగ్గర ఒక గుట్టమీద కూర్చుని గంగను ప్రార్థించాడు. గంగాదేవి ప్రత్యక్షమై ఆతని కోరికమేరకు ఒక నదిగా సువర్ణకాంతులతో భూమిమీద కురికింది. ఆదినేపల్లి దగ్గర ఆ గుట్ట అగస్త్యపర్వతమని, స్వర్ణకాంతులతో ప్రవహించడంవల్ల ఆ నది సువర్ణముఖరీ అని పిలువబడుతున్నాయి.

ఈ నది కొన్నిచోట్ల పూర్వవాహినియై, మరి కొన్నిచోట్ల ఉత్తర వాహినియై ప్రవహిస్తూ చంద్రగిరి కొండలను తాకుతూ శేషాచలం కొండలకు



పాదపూజ చేస్తూ, తొండవాడ అగస్త్యాశ్రమం పావనంచేస్తూ, అలమేలు మంగమ్మను తిరుచానూరులో అలరిస్తూ, గుడిమల్లం పరశురామేశ్వరుని పలకరిస్తూ, శ్రీకాళహస్తిని దక్షిణకాశీగా మార్చి అలానే వెళ్లి నాయుడుపేట దాటుకొని పూర్వసముద్రంవైపు పరుగులు తీస్తుంది. ఈ నదీ గమనంలో తొట్టదొలుత ఆవిర్భవించినదే తొండవాడ అగస్త్యేశ్వర క్షేత్రం. అగస్త్యమహాముని సువర్ణముఖరీ పరివాహక ప్రదేశమంతా పరిశీలించి దక్షిణకాశియైన శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించిన తరువాత త్రివేణీ సంగమమైన తొండవాడలో అగస్త్యాశ్రమం స్థాపించినాడు.

స్వర్ణముఖిలో చంద్రగిరికెగువన భీమానది కలుస్తుంది. తొండవాడ కెగువన శ్రీనివాసమంగాపుర వికల్య (కళ్యాణి) నది కలుస్తుంది. అందువల్ల త్రివేణీ సంగమం. ఒకప్పుడు నది కిరువైపులా మొగలి పొదలు దట్టంగా వ్యాపించి ఉన్నప్పుడు దీనిని మొగిలేరు అని కూడా పిలిచేవారు. అగస్త్య మహాముని ఒకరోజు నదిలో స్నానం చేస్తుండగా ఆయనకొక శివలింగం దొరికింది. దాని నలాగే ఆయన గట్టుమీద ప్రతిష్ఠించి శ్రీ అగస్త్యేశ్వరస్వామి అని ప్రాణప్రతిష్ఠచేసినాడు. ఆనందవల్లీదేవి అమ్మవారుగా వెలసింది. విఘ్నేశ్వరుడు, వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ద్వారపాలకులుగా నున్నారు.

నారాయణవనంలో పద్మావతీదేవిని వివాహమాడిన శ్రీనివాసుడలాగే పసుపుగుడ్డలతో మరవలి బయలుదేరి అప్పలాయిగుంట మీదుగా ఈ అగస్త్యేశ్వరస్వామి క్షేత్రం చేరి అగస్త్యమహామునిని దర్శించినాడు. శ్రీనివాసుడు తిరుమలకు పోతూ దారిలో తనను దర్శించుకొన్నాడని గ్రహించిన అగస్త్యుడు హరిద్ర వస్త్రాలతో శైలము నెక్కుట పాడిగాదని వారించి ఆరుమాసాలు అక్కడే ఉండి తరువాత వేంకటాద్రికి పొమ్మని ఆదేశించినాడు అటు అత్తగారింటికి తిరిగిపోలేక, చేయునదిలేక సమ్మతించినాడు. శ్రీనివాసుడు.

నూతన వధూవరులు ఆశ్రమంలో పూజాపునస్కారాలు జరుగువరకు ఉండి తక్కిన సమయం అక్కడికి సమీపంలోని శ్రీనివాసమంగాపురంలో గడిపినారు.

ఆరుమాసాలు గడిచినది. తిరుమలలో చిన్నమామ తొండమాను చక్రవర్తి శ్రీనివాసునికి ఆవాసం నిర్మించినాడు. తన ప్రవాసానికి గుర్తుగా స్వర్ణముఖిలో ఒక బండమీద 'విష్ణుపాదం' అనుగ్రహించి అగస్త్యమహాముని అనుమతి తీసికొని శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు మార్గంగూండా తిరుమల చేరి శ్రీ వేంకటేశుడుగా ఆలయ ప్రవేశం చేసినాడు శ్రీనివాసుడు. పద్మావతీదేవి అనుసరించింది. అందువల్ల తొండవాడక్షేత్రాన్ని అగస్త్యపూజిత విష్ణుపాదం అంటారు. శ్రీ వేంకటేశసహస్ర నామావళిలో, 826వ నామం 'సువర్ణముఖరీ తీర శివధ్యాత పదాంబుజాయ నమః' ఈ సంఘటనను గుర్తుకు తెస్తుంది. ఈ క్షేత్రాన్ని రుద్రపాదాల ముక్కోటి అనికూడ అందుకే వ్యవహరిస్తారు.

సువర్ణముఖి ఎంతో పవిత్రమైనది. కాబట్టే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలు ఇక్కడే వెలశాయి. పద్మావతమ్మ జన్మించిన పద్మసరోవరం ఈ తీరంలోనే ఉంది. ఆమెకూడా ఇక్కడే కొలువై ఉంది. ఆమె ప్రక్కనే పరాశరేశ్వరస్వామి యోగిమల్లవరంలో శైవవైష్ణవ భేదం లేకుండా నిలిచాడు. గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ప్రపంచంలోనే ప్రత్యేకత సంతరించుకున్న శివలింగం. శ్రీకాళహస్తిలోని వాయులింగం పంచభూతలింగాలలో ఒకటియై ఆదిశేషుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ప్రతీకగా నిలిచింది. సువర్ణముఖరిలో స్నానంచేసేవారి అభీష్టాలు శ్రీ వేంకటేశ్వరుడు తీరుస్తాడని అందరివిశ్వాసం. శ్రీ వేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో 105వ నామం 'సువర్ణముఖరీ స్నాత మనుజాభీష్టదాయినే' అనడం దీనిని సూచిస్తుంది.

ఈ స్వర్ణముఖిని సాధించిన అగస్త్యమహాముని అపర భగీరథుడు మాత్రమే కాదు. బహుజనహితుడు. పరోపకారి. రామరావణ యుద్ధంలో



రాములవారికి ఆదిత్యహృదయం బోధించి దానిని పఠించి రావణుని సంహరించమన్నాడు. అది త్రేతాయుగంలో. ద్వాపరయుగంలో పాండవుల హితము కోరినాడు. వాతాపి అనే రాక్షసుణ్ణి వాతాపిజీర్ణం అని జీర్ణం చేసికొన్నాడు. కలియుగదైవము శ్రీ వేంకటేశునికి హితము చేయుటకై తన ఆశ్రమములో నిలుపుకున్నాడు. నారాయణవన రాజ్యానికై వసుదానుడు, తొండమానుడు కలహించుకొని యుద్ధానికి పూనుకోగా వారిద్దరికి సయోధ్యచేసి రాజ్యాన్ని రెండు భాగాలు చేసి చెరిసగం ఇవ్వమని శ్రీనివాసునికి సూచించి యుద్ధాన్ని ఆపు చేయించినాడు.

ఈ విషయాలన్నిటినీ ఎరిగిన చోళ చక్రవర్తులు తొలి ఆలయ నిర్మాణం చేసినట్టుంది. ఎందుకంటే ఈ ఆలయం శ్రీకాళహస్తి ఆలయానికి అనుబంధ ఆలయంగా చాలాకాలం కొనసాగింది. వంద సంవత్సరాల క్రితం నాటుకోటి శెట్టియార్లు శ్రీకాళహస్తి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసినప్పుడు ఈ ఆలయాన్ని కూడా జీర్ణోద్ధరణ చేసి తరువాత స్థానిక మొగిలిరెడ్లకు ఆలయ నిర్వహణను క్రీ.శ. 1909లో అప్పగించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వారే దీనిని నిర్వహిస్తున్నారు. ఆ తరువాత కూడ ఈ ఆలయం ఎన్నోసార్లు జీర్ణోద్ధరణ చేయబడింది. చివరి జీర్ణోద్ధరణ 1981లో జరిగింది. అప్పుడే ఇక్కడ రామాలయం భద్రాచల రాములవారి నమూనాలో మూల విగ్రహాలు తయారు చేయబడి నిర్మింపబడింది.

ఇక్కడున్న ఒక అశ్వత్థవృక్షంతోబాటు ఒక వేపచెట్టు, ఊడగచెట్టు, చింతచెట్టు, బిల్వవృక్షం ఇలా ఐదువృక్షాలు ఒకటిగా పెరగడం ఒక విశేషం. తిరుపతికి 10 కి.మీ. ప్రధానరస్తాకు ఆనుకొనివున్న ఈ క్షేత్రానికి దేవస్థాన ఆలయ దర్శన బస్సులు, పర్యాటకశాఖవారి బస్సులు వచ్చి పోతుంటాయి.

* * * * *

# 10. శ్రీకాళహస్తి - శ్రీకాళహస్తీశ్వరస్వామి

శ్రీ - సాలెపురుగు, కాళ - సర్పము, హస్తి - ఏనుగు. సాలెపురుగు శివలింగం మీద గూడు అల్లింది. దానిని తొలగించి సర్పము మణులతో పూజించింది. ఏనుగు తొండంతో నీరుదెచ్చి శివలింగాన్ని అభిషేకించడంతో ఆ మణులు రాలిపోయాయి. ఈ పూజల పరంపరతో సాలెపురుగు దూటితో బాటు చచ్చింది. పాము కోపంతో ఏనుగు తొండంలో దూరింది. ఆ బాధలో ఏనుగు తన తలను రాతికేసి బాదుకొనింది. ఏనుగు మరణించింది. దాంతో బాటు పాము చచ్చింది. శివుని పూజలో ఇవన్నీ చితికిపోయినందువల్ల సాయుజ్యం పొందాయి. ఈ మూడిటిపేరుతో ఆ క్షేత్రం వెలసింది. అదే శ్రీ కాళ హస్తి. కన్నడనే బోయవాడు స్వామిమీద భక్తితో పుక్కిట నీరు దెచ్చి అభిషేకించి, పందిమాంసం నైవేద్యం పెట్టి ఆనందిస్తుండగా శ్రీకాళహస్తీశ్వరుడు వీడిని పరీక్షింపదలచి తన కళ్లకు రక్త స్రావణ రోగం తెచ్చుకోగా, కన్నప్ప తనకళ్లను శివునికళ్లస్థానంలో అమర్చి భక్తకన్నప్పగా అమరత్వం పొందినాడు. ఇంకా జంగమయ్య, నత్కీరుడు, దేవదాసీలు ఇలాంటి వారెందరో ఈ కోవలోకి వచ్చు మహాభక్తులు. శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజకవులలో ఒకడైన ధూర్జటికవి ఈ ఊరివాడు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం వ్రాసి వాసి గన్నవాడు.

తిరుపతికి 35 కి.మీ. దూరంలో సువర్ణముఖీతీరంలో వెలసిన ఈ దక్షిణ కైలాసం సనాతన క్షేత్రం. రాహుకేతువులు నెలకొని వారి శాంతి పూజలకు ప్రసిద్ధిగాంచింది. వీరికి తోడుగా శనిదేవుడు కూడా ఇక్కడ వెలసి పూజలందు కొంటున్నాడు. ఈ ఆలయానికి పల్లవులు నటరాజ రంగస్థలం అనే గుహామండపాన్ని శిల్పాలతో చెక్కి తీర్చిదిద్దినారు. పంచముఖేశ్వర శివలింగం (కొందరు బ్రహ్మ అంటారు), నటరాజ, పార్వతీ పరిణయం, కుమారస్వామి, నృత్యగణపతి, ఆలింగన మూర్తి, భిక్షాటనమూర్తి శిల్పాలు మహాబలిపుర పల్లవ శిల్పాలను గుర్తుకుతెస్తాయి.



ఇక తక్కిన సమున్నత ఆలయ నిర్మాణమంతా చోళరాజులదే. క్రీ.శ.1000వ సంవత్సరం నుంచి క్రీ.శ.1200 దాకా దాదాపు 200 సంవత్సరాలు ప్రధాన ఆలయ నిర్మాణం జరుగుతూనే ఉండినది. ఇక్కడి నీలకంఠేశ్వర ఆలయం (నీలగిరీశ్వరం) సుమారు క్రీ.శ. 1150లో మొదటి కులోత్తుంగ చోళుని కాలంలో నిర్మించగా మూడవరాజరాజచోళుడు క్రీ.శ. 1222-23లో జీర్ణోద్ధరణ చేశాడు. మణికంఠేశ్వర ఆలయాన్ని రాజరాజ చోళుడు క్రీ.శ. 1008-09లో ఇటుకలతో నిర్మించగా, వీరరాజేంద్రచోళుడు (కులోత్తుంగ -3) క్రీ.శ.1188-89లో రాతితో పునరుద్ధరించినాడు. ఈయనే కాశీవిశ్వేశ్వరాలయాన్ని నిర్మించాడు. యాదవరాజులు ఎన్నో దానాలు చేశారు. వీరు నెల్లూరుసీమను, చిత్తూరు తూర్పుభాగాన్ని ఏలినవారు. శ్రీకృష్ణదేవరాయలు పెద్దగోపురాన్ని, నూరుకాళ్లమండపాన్ని నిర్మించాడు. తూర్పుదిగ్విజయయాత్ర విజయసూచకంగా కట్టిన ఈ గోపురం కూలిపోయింది. ఇప్పుడు కట్టాలని ప్రయత్నిస్తున్నారు.

ఈ ఆలయంలో రాజరాజచోళుని రాణి నంబిరాట్టియార్ చోళమదేవియార్ అందమైన లోహవిగ్రహం ఉంది. సుందరమైన సుందర నాయనార్, కన్నప్పనాయనార్ తదితర 63 నాయన్మార్ల లోహవిగ్రహాలు ఇంకా కేట్టన్ఆదిత్తాన్(మగ) కలియాన్వై(స్త్రీ) విగ్రహాలు అనేక ఉత్సవ విగ్రహాలు ఈ ఆలయ శోభను ఇనుమడింపజేస్తాయి. అమ్మవారి పేరు జ్ఞానప్రసూనాంబ, జ్ఞానప్రదాత. ఆలయంలో ప్రవేశించగానే ఎదురుగా దక్షిణా మూర్తి ఆహ్వానిస్తాడు. దక్షిణ గోపురానికి ఇరువైపులా అక్కన్న, మాదన్న ప్రతిష్ఠిత లింగాలు అందంగా అమరినాయి. శాసనాలలో శ్రీకాళహస్తి పేరు ముమ్మడి చోళపురం. ఇది రాజేంద్రచోళమండలం, తిరువేంకటకొట్టం అట్టూరునాడుకు చెందినదిగా వ్రాయబడింది.

* * * * *

## 11. తొండమనాడు - శ్రీ పెరుమాళ్‌స్వామి

ఆకాశరాజు తొండమానుడు నారాయణవనరాజ్యం సగభాగం పంచుకొని తన రాజధానిని ఇక్కడ నెలకొల్పుకున్నాడు. అందువల్ల ఇది తొండమనాడై తదనంతరకాలంలో తొండమండలం అని కూడ పిలువబడింది. విజయనగర చక్రవర్తులకాలం వరకు ఈ ప్రాంత భూభాగం ఆ పేరుతోనే ప్రసిద్ధమైంది. శ్రీ వేంకటాచలమాహాత్మ్యం కథనం మేరకు తొండమానుచక్రవర్తి తిరుమల శ్రీవారికి అనుంగుభక్తుడు. రోజూ దర్శించేవాడు. అర్చన చేసేవాడు. ఆప్యాయంగా మాట్లాడేవాడు. ఎప్పుడు బడితే అప్పుడు స్వామి దగ్గరకు వచ్చేవాడు. ఒకసారి స్వామి పాదాల దగ్గర మట్టిపూలు పడి ఉండడం చూసి ప్రశ్నించగా అవి కురువనంబి కుండలు చేస్తూ చేతికంటినమట్టిని పూలుగా చేసి పూజిస్తూ ఉంటే అవి తన పాదాల దగ్గర కొచ్చి పడుతున్నాయని స్వామి సెలవిచ్చాడు. ఒక బ్రాహ్మణుడు తన ఆలుబిడ్డలను తొండమానుని సంరక్షణకు వదలి కాశీయాత్రపోయి వచ్చి వారిని అప్పగించమనగా వారి సంగతి మరచిపోయిన తొండమానుడు అప్పుడు చూసుకొని వారు చనిపోయి ఉండడం గ్రహించి వారిని బ్రతికించమని శ్రీవారిని ప్రాధేయపడతాడు. విధిలేక శ్రీవారు బ్రాహ్మణుని భార్యాబిడ్డలను బ్రతికించి అప్పటినుంచి తొండమానుడితో మాట్లాడడం మానివేస్తాడు.

చేయునది లేక తొండమానుడు తన ఊరిలోనే శ్రీవారి ఆలయం నిర్మించి అక్కడే పూజాపునస్కారాలు చేసికొంటూ జీవితాంతం గడిపినాడు. ఇంకొక కథనం ప్రకారం శ్రీవారు తొండమానుడితో 'నీవు ఇకమీదట నావద్దకు రావద్దు. నేనే నీ వద్దకు విరజానదితో సహా వస్తాను.' అని చెప్పి ఆ మరుసటిరోజు ఉదయానికల్లా తొండమానుడి ఇంట్లో విగ్రహరూపంలో ప్రత్యక్షమయ్యాడట. వెలుపలికి వచ్చి చూస్తే పవిత్ర విరజానది ఇంటి ముందునించి చెరువువైపు ప్రవహిస్తూ కనిపించిందట. తొండమానుడి అభీష్టం నెరవేరింది. ఇంట్లో దేవుడు పుట్టాడు. అందువల్ల ఆ వేంకటేశుని వీట్ట పిరుంద పెరుమాళ్, (ఇంట్లో పుట్టినదేవుడు) అనిపిలిచాడు. విరజానది అంతర్వాహినియై తొండమనాటి చెరువులోకి ప్రవహిస్తుంది.

నట్టింట్లోకొచ్చి కూర్చున్నదేవుడు కూర్చున్నట్టే ఉన్నాడు. ఈ పెరుమాళ్ శ్రీదేవి భూదేవి సహిత ఆసనమూర్తి. అభయహస్తంతో గంభీరంగా ఉంటాడు. తొండమానుడు వారి చుట్టూ ఆలయం నిర్మించి ఆలయం చుట్టూ కోటను నిర్మించాడు. తొండమనాటి చెరువుంది. పెరుమాళ్ ఆలయం దాంతోబాటు ఆదిత్యేశ్వర ఆలయముంది. మిగతావన్నీ అదృశ్యమైపోయాయి. ప్రస్తుతం ఈ పెరుమాళ్‌స్వామి ఆలయం తి.తి.దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఉంది.

ఈయన ఆలయ విమానం తిరుమల ఆనంద నిలయ విమానాన్ని పోలి ఉంటుంది. శిల్పం లేని అంతరాళముంది. ముఖమండపంలో కొన్ని వైష్ణవ శిల్పాలున్నాయి. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తే వేంకటేశ పెరుమాళ్ సంతోషిస్తాడు.

ఇక్కడున్న మరొక ప్రాచీనఆలయం ఆదిత్యేశ్వర లేక కోదండ రామేశ్వరాలయం. మొదటి పరాంతక చోళుడు, తన తండ్రి మొదటి ఆదిత్యుడు ఇక్కడ (పల్లవులతో?) జరిగిన యుద్ధంలో మరణించడం వల్ల ఆయన స్మృత్యర్థం అస్థికలమీద క్రీ.శ.940-41లో నిర్మించిన ఆలయమిది.

రాజరాజచోళుని కాలంలో (క్రీ.శ.1005) గట్టిదేవయాదవరాయలు పెరుమాళ్ ఆలయానికి కిదరన్ కొండ చోళపురమను గ్రామాన్ని దానం చేశాడు. మధురైకొండ కొప్పరికేసరి 34వ పాలనా సంవత్సరంలో (క్రీ.శ.1018-1052?) కోదండ రామేశ్వరుని 7 రోజుల ఉత్సవానికి తొండమాన్ పెరఱ్ఱూరు సభవారికి నగర పాలకులకు 105 కళంజుల బంగారును సమర్పించాడు. తిక్కయదేవ మహారస క్రీ.శ. 126లో తొండమనాటి చెరువుకు కళుజు కట్టించాడు.

* * * * *

# 12. కాశీబుగ్గ (నగరి) శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి

అహల్యాశాప సంఘటనతో కలత చెందిన గౌతమమహర్షి మనశ్శాంతి కోసం దేశాటనం చేస్తూ కుశస్థలినది ఒడ్డుకు చేరి అచ్చటి మనోజ్ఞమైన ప్రకృతిని చూసి 'ఈ ప్రదేశం కాశివలెనున్నది. ఇచ్చట విశ్వేశ్వరుడుండిన బాగుండు'నని శివుని ప్రార్థించి ఆయనక్కడుండుమని కోరగా ఈశ్వరు డంగీకరించాడు. అందువల్ల ఇది దక్షిణకాశి అయ్యింది. తూర్పు కనుమలలోని ఈ కాకమూకపర్వతాలలో గంగకూడ ప్రవహిస్తే బాగుంటుందని ఆమెను ప్రార్థించాడు. గంగావతరణం జరిగింది. ఆమె మూడుపాయలుగా చీలి కుశస్థలినదిలో కలిసింది. అవే కాశీపాయ, రామేశ్వరంపాయ కుశస్థలిపాయ. ఈ మూడు పాయలకు ఇటుక కాలవలు కట్టినారు. పాయలలో ప్రస్తుతం నీరు పారకపోయినా కాలవలు మాత్రం ఉన్నాయి. 1932లో వరదలు వచ్చి అంతా కొట్టుకపోగా కంచి పెద్దస్వామి శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతి ఆలయపునర్నిర్మాణం గావించి పూజా విధులను యథావిధిగా జరిగేట్టు చేశారు. ఇక్కడ వారి కంచిమఠశాఖ కూడ ఉంది.

ఆలయముఖ మండపం శిల్ప శోభతో విలసిల్లుతోంది. ఒకవైపు కాశీ విశ్వేశ్వరుడు గౌతమమహర్షికి ప్రత్యక్షమై ఆ ప్రదేశంలో అవతరించడం శిల్పించారు. మరోవైపు గౌతమమహర్షి కాశీవిశ్వనాథుని ప్రతిష్ఠించి పూజించడం చెక్కినారు. శిల్పశైలిలో పల్లవ, చోళ శిల్ప కళారీతులు ఉన్నాయి.

తిరుపతికి సుమారు 56 కి.మీ. దూరంలో ఉన్న ఈ బుగ్గ ఆలయం అనేక పేర్లలో పిలువబడుతోంది. క్షేత్రపాలకుడు కాలభైరవుడు కావున కాలభైరవక్షేత్రమని, గౌతమమహర్షి స్థాపనం వల్ల గౌతమక్షేత్రమని, పంచలింగాలు ప్రతిష్ఠింపబడడంవల్ల పంచముఖక్షేత్రమని, బుగ్గవల్ల బుగ్గ ఆలయమని, కాశీ విశ్వేశ్వరుడు దక్షిణాదికి వచ్చినందువల్ల దక్షిణకాశి యని పేరుగాంచింది.



ఆలయం చుట్టూ అనేక చిన్నమండపాలున్నాయి. వాటిలో దొంటి వినాయకుడు, సద్యోజాతమూర్తి, వామదేవమూర్తి, అఘోరమూర్తి, తత్పురుషమూర్తి (పంచలింగాలు), వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, కాశీవిశాలాక్షి, వీరభద్ర, మహిషాసుర మర్దిని, విష్ణుదుర్గ (చేతిలో శంఖు చక్రాలు) ప్రతిష్ఠింపబడి ఉన్నారు. ఎత్తయిన ప్రహరీగల ఈ ఆలయం తూర్పుముఖ ప్రవేశద్వారం కలిగి ఉంది. మూడంతస్తుల రాజగోపురం దాటు కుంటూనే ధ్వజస్తంభం, బలిపీఠం వస్తాయి. బలిపీఠానికి ప్రక్కన దక్షిణాభిముఖంగా ఉన్న చిన్నగుడిలో క్షేత్రపాలకుడైన కాలభైరవస్వామి ఉన్నాడు. ఆతని వాహనం శునకం ముందు ఉంది.

శివాలయానికి ఉత్తరంగా ప్రయాగమాధవరాహస్వామి శ్రీదేవి భూదేవి సహితంగా ప్రతిష్ఠింపబడి ఉన్నాడు. ఇదే పేరుతో నారాయణవనంలో కూడా వెలసి ఉన్నాడు. ఈయన కార్వేటినగర రాజులకు ఇష్టదేవత ఏమో? తొలి ఆలయ నిర్మాతలు చోళరాజులు కావచ్చు. వారి తర్వాత యాదవులు, వారి నుంచి కార్వేటినగర రాజులు పరంపరగా ఆలయ నిర్వహణను చేసినట్టున్నారు.

ఈ ఆలయం 1994 సంవత్సరం తి.తి.దే. వారి ఆధీనానికి వచ్చినది. వారు దీనిని జీర్ణోద్ధరణ చేసి 2006లో మహా సంప్రోక్షణం గావించినారు. ఈ సందర్భంగా ఒక దాత వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రయాగ మాధవరాయస్వామి పంచలోహ విగ్రహాలను తయారు చేయించి సమర్పించినాడు.

* * * * *

# 13. కరియమాణిక్య నగరి - శ్రీ కరియమాణిక్యస్వామి

కరియ అంటే కర్రి లేదా నలుపు. మాణిక్యం అంటే కెంపు లేక రత్నం. నల్లని కెంపులాగ మెరిసే పెరుమాళ్ ఆయనే కరియమాణిక్య పెరుమాళ్. రాములవారు నల్లన. కృష్ణులవారు నల్లన. వేంకటేశులవారు నల్లన. ఈ ముువ్వురిలో ఈయన ఎవరు? యాదవుల కులదైవమైన కృష్ణులవారు. యాదవరాజులు తమ పాలనలో నిర్మించిన అనేక కృష్ణాలయాలతో ఇది ఒకటి. కానీ ఈయన ఎవరు? యాదవుల కులదైవమైన కృష్ణులవారు. యాదవరాజులు తమ పాలనలో నిర్మించిన అనేక కృష్ణాలయాలలో ఇది ఒకటి. కానీ ఈయన వేంకటేశ్వరస్వామి రూపురేఖలతో ఉండడంవల్ల పెరుమాళ్ అని పిలువబడుతున్నాడు. అందువల్ల కరియ మాణిక్య పెరుమాళ్ అంటే శ్రీ వేంకటేశ్వరస్వామి.

ఈ ఆలయాన్ని ఏరాజు నిర్మించాడో తెలియదు. అంటే శాసనాధారం లేదు.క్రీ.శ.1556 నాటి శాసనంలో వీరసదాశివరాయలు ఈ దేవుని పెరుమాళ్‌గా పేర్కొన్నాడు. అంటే ఆలయం అప్పటికే ప్రాముఖ్యంలో ఉందని గ్రహించవచ్చు. కార్వేటినగరరాజులు అప్పటి నగరి, తిరుత్తణి, అత్తిమంజేరిపేట తాలూకాలలోని ఆలయాలతో బాటు ఈ ఆలయాన్ని కూడా నిర్వహించేవారు. తి.తి.దేవస్థానం వారు ఈ ప్రాంతంలోని ఆలయాలను నిర్వహణకు 1993-94లో తీసికొన్నప్పుడు ఈ ఆలయాన్ని కూడా తీసికొని నిర్వహిస్తున్నారు.

శ్రీదేవి భూదేవి సహిత కరియమాణిక్య పెరుమాళ్‌స్వామికి ఏటా కార్తీక పూర్ణిమనాడు పవిత్రోత్సవం జరుగుతుంది.

**సత్రవాడ-** నగరి నుంచి పల్లిపట్టు పోవు మార్గంలో 6. కి.మీ దూరంలో సత్రవాడ ఉంది. ఇక్కడి శ్రీదేవి భూదేవి సహిత కరివరదరాజస్వామికి ఆశ్వయుజ మాసంలో రెండురోజులపాటు పవిత్రోత్సవం జరుగుతుంది.

* * * * *

# 14. కాణిపాకం -శ్రీ వరసిద్ధి వినాయకస్వామి

సత్యప్రమాణాలదేవుడు కాణిపాక వరసిద్ధి వినాయకుడు. సత్యం చెబుతున్నానని తరిగొండలో లాగ ఇక్కడ కూడ ప్రమాణంచేస్తూ ఉంటారు. అది సర్వాంగికారం. ఈ స్వామి స్వయంభువు, పెరుగుతూ ఉంటాడు. దానికి నిదర్శనం ఆయన నగలు, కిరీటం వగైరా బిగుతుగా అయిపోయి పట్టకుండా పోతాయి. తిరిగీ చేయించాల్సిందే.

యాత్రీక భక్తులు తిరుమల తిరుపతి సందర్శించిన తరువాత చూడాలని ఉబలాటపడే క్షేత్రాలలో ఇది ఒకటి. తిరుపతి నుంచి దాదాపు 75 కి.మీ. దూరంలో ఉంటుంది. ఆర్.టి.సి. బస్సులు అధికంగా ఉన్నాయి.

కాణిపాకం పేరు ఏ మార్పులేక చోళరాజుల కాలం నుంచి అలాగే ఉంది. కాణి అంటే పరిమాణం లేదా భూమి యట. ఈ గ్రామంలో ముగ్గురు అన్నదమ్ము లుండేవారట. వారిలో ఒకడు గుడ్డివాడు, మరొకడు మూగవాడు, ఇంకొకడు చెవిటివాడు. వారికి కాణి భూమి ఉండేదట. వ్యవసాయం చేసికొని జీవించేవారు. బావి త్రవ్వి, ఏతంతో నీరు తోడి రోజూ ఒక మట్టిబాన పగులగొట్టుకొనేవారు. బావిని వెడల్పు చేస్తే మట్టిబాన పగులదని త్రవ్వడం ప్రారంభించారు. గడ్డపార ఒక రాయిని తగిలి రక్తం చిమ్మింది. తీరా చూస్తే అదొక విఘ్నేశ్వరుని మూర్తి. ఆ మూర్తిని చూడగానే గుడ్డివాడికి చూపు వచ్చింది. మూగవాడికి మాట వచ్చింది. చెవిటివాడికి వినిపించింది. వారి ఆనందానికి అంతులేదు. ఊరంతా తెలిసిపోయింది. అందరికీ అంతులేని ఆశ్చర్యం కలిగింది. వినాయకుణ్ణి అలాగే ఉంచి బావిచుట్టూ ఆలయం కట్టేశారు.

కాణి భూమిలో దొరికాడు కాబట్టి కాణిపాక వరసిద్ధి వినాయకుడైనాడు. చుట్టుప్రక్కల మహాప్రసిద్ధిగాంచాడు. స్వయంభువు కావున ఆయన ముందు అందరూ సత్యమే చెప్పాలి. అనృతమాడరాదు. ఉల్లంఘిస్తే అధోగతిపాలే.

బావిలో ఉన్నందుకు గుర్తుగా ఆయన చుట్టూ నీరు భూమట్టానికి ఉంటుంది. ఆ చుట్టు ప్రక్కల అలా ఉండదు. బోర్లు వేసి నీరు తీయాల్సిందే. స్వామిచుట్టూ ఉన్న నీటినే తీర్థంగా వాడతారట. గర్భగుడి ముందు అంతరాళం, ముఖమండపం, మహామండపమున్నాయి. స్వామి కెదురుగా మూషిక మండపంలో స్వామివాహనం మూషికం ఉంది. ముఖమండప ప్రవేశానికి ఇరువైపులా వినాయక, కుమారస్వామి విగ్రహాలున్నాయి. ఇరుకైన అంతరాళం నుంచే స్వామిని దర్శించుకోవాలి. మూషికం ప్రక్కన నంది విగ్రహం కూడా ఉంది.

ఆలయానికి ప్రాకారం ఉంది. మూడంతస్తుల రాజగోపురం ఉంది. దాని ముందు కోనేరు ఉంది. స్నానం చేస్తే చేయవచ్చు. లేదా కాళ్లూ చేతులు కడుక్కొని నెత్తిన నీళ్లు చల్లుకొని దర్శనానికి పోవచ్చు. కొందరు తలనీలాలు సమర్పిస్తారు. కొందరు ఇక్కడ వివాహాలు చేసికొంటారు. ఆలయం లోపల ముష్టిచెట్టుక్రింద ఉన్న నాగప్రతిమల దగ్గర కొందరు సంతానం కోసం సాగిలబడతారు.

ఇక్కడ రెండు ధ్వజస్తంభాలున్నాయి. ఒకటి రాతిది. ఇంకొకటి లోహపు తొడుగుది. నూతన వాహనాలు కొనుగోలు చేసినవారు వాటిని ఇక్కడకు తీసుకవచ్చి స్వామివారి కృపకు పూజలు చేయించుకుంటారు.

ఇక్కడ చోళుల కాలంనాటి రెండు ఆలయాలున్నాయి. ఒకటి మణికంఠేశ్వరాలయం (మణివన్దీశ్వరం) మూడవ కులోత్తుంగచోళుడు క్రీ.శ. 1186లో నిర్మించాడు. రెండవది వరదరాజస్వామి ఆలయం కూడ ఆకాలంలోనే నిర్మింపబడినదంటారు. వినాయకస్వామికి మాత్రం శాసనం లేదు.

* * * * *